ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 04.04.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 15 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

సొంత గడ్డపై చెన్నై చిత్తు! 8

2047 నాటికి దక్షిణాసియా..

టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణ

> 'మన పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరు ఉంది. టెక్స్టైల్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాం. ఇందులో అనేక అపారెల్ పార్కులు ఉన్నాయి. తెలంగాణలో నైపుణ్యంతో పాటు సంకల్పం కూడా ఉంది. డీప్ టెక్ , ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ ఇలా అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉంది'
>
> - సీఎం రేవంత్‌రెడ్డి

- తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం
- నాణ్యమైన వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర
- టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు చేనేతలకు జీవితమని వెల్లడి
- రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలి: మంత్రి శ్రీధర్‌బాబు
- హైదరాబాద్‌లో ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్- 2026

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్3: 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హెచ్‌సీసీలోని నోవాటెల్‌లో ఆసియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ 2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టెక్స్‌టైల్స్ అనేది రాష్ట్ర ప్రజల డీఎన్ఏలోనే ఉందని అన్నారు. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారిందన్నారు. నాణ్యమైన వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదని చేనేతలకు జీవితమని చెప్పారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన ఏసియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ 2026లో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మలతో కలిసి సీఎం పాల్గొన్నారు. టెక్స్‌టైల్స్ అనేది రాష్ట్ర ప్రజల డీఎన్ఏలోనే ఉందన్న సీఎం అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని వెల్లడించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మారడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామని ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారిందని అన్నారు. టెక్స్టైల్ మనకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు జీవనాధారం.. పోచంపల్లి ఇక్కత్ నుంచి గద్వాల్ చీరల వరకు, వరంగల్ దుర్రీస్ నుంచి

...:: మిగతా 2లో

అడ్డగోలుగా ఫీజుల భారం

ప్రయివేటు ఫీజు దోపిడీ నుంచి రక్షించండి

- ఫీజులు పెంచి తల్లితండ్రులను ఆగం చేస్తున్నారు
- వెంటనే ఫీజు నియంత్రణ చట్టం తేవాలి
- ఇందు కోసం అసెంబ్లీ స్పెషల్ సెషన్ నిర్వహించాలి
- చట్టం తేకపోతే జాగృతి ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తాం
- ఫీజుల నియంత్రణ చట్టం తేవటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం
- బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల దోపిడీని ప్రోత్సహించింది
- కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే
- ప్రయివేటు కార్పొరేట్ స్కూళ్లలో తెలంగాణ వారికి ఉద్యోగాలివ్వాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 3: ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు ఒకేసారి 30 శాతం నుంచి 40 శాతం ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహించి బిల్లు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 12 వేల ప్రైవేట్ స్కూల్స్ లో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ఆయా విద్యార్థుల తల్లితండ్రులపై ప్రయివేటు స్కూల్స్ అడ్డగోలుగా ఫీజుల భారం మోపుతున్నాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తేవటంలో విఫలమైందంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు దోపిడీని ప్రోత్సహించింది

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి

...:: మిగతా 2లో

అసోం ఓటర్లకు అమిత్ షా హామీలు

అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాటుదారులను అరికడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అలాగే చొరబాటుదారులను అసోం నుంచి వెనక్కి పంపుతుందని వెల్లడించారు.

7

మయన్మార్ దేశాధ్యక్షుడిగా మిన్ ఆంగ్ ఎన్నిక

మయన్మార్ కొత్త దేశాధ్యక్షుడిగా మిన్ ఆంగ్ హయింగ్‌ను ఇవాళ ఆ దేశ పార్లమెంట్ ఎన్నుకున్నది. మిలిటరీ జనరల్ అయిన మిన్ ఆంగ్.. ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు.

7

రెవెన్యూశాఖలో కొత్త శకానికి నాంది

- ఒకే గొడుగు కిందకు భూసర్వే, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ
- భూ సమస్యల పరిష్కారానికి 'సమీకృత భూభారతి'
- రైతులకు భరోసా, భద్రత కల్పించేందుకే తెచ్చాం
- రంగారెడ్డి జిల్లాలో పోర్టల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్4: రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన మార్పు మొదలైంది. భూమి సర్వే, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ ఇప్పటి వరకు మూడు వేర్వేరు శాఖల్లో ఉన్న సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చే సమీకృత భూ భారతి పోర్టల్‌కు తొలి అడుగు పడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మిరాయిపల్లిలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను రెవెన్యూ శాఖ మంత్రి

...:: మిగతా 2లో

ఏఐ ముప్పును ఎదుర్కొనడానికి

ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయాలి

- ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతే దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం
- బ్లూ కాలర్ ఉద్యోగాలకు అనుగుణంగా వాతావరణాన్ని మార్చుకోవాలి
- విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం
- ఏవీఎన్‌లేక్ ఫీల్డ్‌గ్లోబల్‌స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 3: ఒక సునామీలా ముంచుకొస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ముప్పును ఎదుర్కొనడానికి ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు కోల్పోతే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత ప్రమాదంవైపు నెట్టబడుతుందని, ప్రత్యామ్నాయంగా బ్లూ కాలర్ ఉద్యోగాలకు అనుగుణంగా వాతావరణాన్ని మార్చుకోవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. విద్యావేత్త, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఇబ్రహింపట్నంలో స్థాపించిన

...:: మిగతా 2లో

> ప్రతి గ్రామంలోనూ విద్య అందుబాటులో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఎక్కడ విఫలమయ్యామో ప్రజా ప్రతినిధులు అందరూ ఆలోచన చేయాలి. పరిస్థితులకు అనుగుణంగా కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాలి. వ్యవస్థను ఎంపవర్ చేయాల్సిన అవసరముంది.
>
> - సీఎం రేవంత్

ఐదుగురు భారతీయులకు గాయాలు

యూఏఈ రాజధాని అబుదాబిలో మరో ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. క్షిపణి శకలాలు పటడంతో 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురు భారత పౌరులు కాగా, మిగతా వారు నేపాల్ జాతీయులు.

7

ఎస్టీల హక్కులను కాలరాస్తూ కేరళకు వెళ్లి గొప్పలా?

- ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటినీ నెరవేర్చలేదు
- రెండున్నరేళ్లలో ఒక్క ఎస్టీకి కూడా ఆర్థిక సాయం అందలేదు
- ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- కొడంగల్‌లో విలేకరులతో మాజీ మంత్రి హరీష్ రావు

...:: 2లో

శత్రు దేశాలపై ఇరాన్ క్షిపణుల వర్షం

- అమెరికన్ ఎఫ్15ఈని కూల్చిన ఇరాన్
- ఇజ్రాయెల్ మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడులు
- దుబాయ్‌లోని ఒరాకిల్ డాటా సెంటర్ పైనా అటాక్
- కువైట్‌లోని రిఫైనరీ, ఉప్పునీటి శుద్ధి ప్లాంట్లపైనా దాడి

...:: 2లో

కేరళలో సీఎం రేవంత్ అసత్య ప్రచారం

- రాష్ట్రంలో హామీలన్నీ అటకెక్కాయి
- ఆరు గ్యారెంటీలు అమలు చేశామనడం విడ్డూరం
- ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి
- గత పదేళ్లుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి
- ఇప్పుడు కాంగ్రెస్ వస్తే మరింత అవినీతి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్: కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనపై కేంద్ర మంత్రి

...:: మిగతా 2లో

రాఘవ్ చద్దాపై ఆప్ మాటల దాడి..

ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత రాఘవ్ చద్దాపై ఆ పార్టీ విమర్శల బాణం ఎక్కుపెట్టింది. చద్దాకు వ్యతిరేకంగా ఆప్ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. ఆయన బీజేపీతో చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు.

7

రెవెన్యూశాఖలో కొత్త శకానికి నాంది

మొదటిపేజీ తరువాయి

పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. 45 రోజుల పాటు అమలు చేసి, మార్పు చేర్పులపై పరిశీలన చేస్తామని మంత్రి పేర్కొన్నారు. భూ భారతి పోర్టల్‌లో సేవలు సత్వరంగా లభిస్తాయన్న మంత్రి రైతు స్మార్ట్‌ఫోన్‌తో ఇంటి నుంచే లాగిన్ అయి అన్ని సేవలు పొందవచ్చని వివరించారు. ఇకపై క్షేత్ర స్థాయిలో భూమికి, రికార్డుల్లోని సమాచారానికి సరిపోలితేనే భూ భారతి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. పట్టా పాసు పుస్తకంతో పాటు భూధార్ నంబరును కేటాయిస్తారు. భవిష్యత్‌లో ఆ భూమి సర్వే సంఖ్యలు, విస్తీర్ణం మార్చడం లాంటి వాటికి ఆస్కారమే ఉండదు. పకడ్బందీగా భూముల వ్యవస్థను తీర్చిదిద్దేందుకు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి ఈ ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది.

సాగు భూముల రిజిస్ట్రేషన్‌కు భూ సర్వే తప్పనిసరి

2020 నవంబర్ రెండో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్‌లో ఏ సమాచారం ఉంటే ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేయడంతో క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటన్నింటినీ సరి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ విభాగాలను ఒకే పోర్టల్ కిందకు తీసుకొచ్చింది. సర్వే వివరాలు, స్టాంపులురిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న వివరాలు, రెవెన్యూ శాఖ రికార్డుల్లోని వివరాలు ఈ పోర్టల్ లో అందుబాటులో ఉంటాయి. సాగు భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకుంటే ఇకపై భూమి సర్వే తప్పనిసరి. అనంతరం రెవెన్యూ శాఖ రైతుకు సర్వే పటం జారీ చేస్తుంది. దాని ఆధారంగా భూ భారతి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో ఎంత భూమి ఉంటే అంత భూమికే రిజిస్ట్రేషన్ చేస్తారు.

ధరణి దోచుకునేందుకుకే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్రంలో 9 లక్షల 52 వేల సాదాబైనామా దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారం కాకుండా నలిగిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం వారం కిందట భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశాం. సాగు చేస్తూ ఆధీనంలో ఉన్న వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకుని ఆ భూమి పట్టాను ఖరారు చేయడానికి అనుమతి ఇచ్చే ఈ జీవో సాదాబైనామా బాధితులకు కొత్త ఆశాకిరణంగా మారింది. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాలిటీగా మారిన ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి కూడా సాదాబైనామా సదుపాయం వర్తించేలా చేస్తాం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

కేరళలో సీఎం రేవంత్‌అసత్య ప్రచారం

మొదటిపేజీ తరువాయి

కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం విడ్డూరం ఉందని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇది సాధారణ అబద్ధం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రయత్నమని కిషన్ రెడ్డి ఆగ్రహించారు.

ఆరు గ్యారెంటీలు అటకెక్కాయి..

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..'మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇచ్చారా?.' అని ప్రశ్నించారు. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం మోసమైతే.. అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్ధాలు చెప్పడం ప్రజలను దగా చేయడమేనని అన్నారు.

ఉచిత స్కూటర్లు ఎక్కడ?

'తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి?. ఇవన్నీ చేయకపోయినా..గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ మాటలను నమ్మకండి.' అని అన్నారు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయని, గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు.. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు కానీ ఓట్లు మాత్రం పడవు అని అన్నారు.

కేసీఆర్ హామీలు అమలు చేయలేదు..

సీఎం రేవంత్ రెడ్డివి మోసం చేసే రాజకీయాలు. గతంలో కేసీఆర్ ఎలా హామీలు ఇచ్చి అమలు చేయలేదో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. అమలు చేయకపోయినా 'చేశామని అనుకోండి' అనే ధోరణి ప్రమాదకరమని, 2014కి ముందు బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం ముంపు ప్రాంతాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఉన్న అంశాలు కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వ నిర్ణయాల వల్లే జరిగాయి. దీనికి బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్ విషయంలో మేము పూర్తిస్థాయి దర్యాప్తు కోరుతున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక మేడిగడ్డ లేదా కొన్ని పిల్లర్ల విషయంపై మాత్రమే మాట్లాడుతున్నారు. ప్రాజెక్టు మొత్తంగా సీబీఐ విచారణకు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉంది. పూర్తి నిజాలు బయటకు రావాలి అన్నారు.

కాంగ్రెస్‌దే బాధ్యత..

'గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక ఆరోపణలు చేసింది. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, కేసీఆర్ కుటుంబంపై కేసులు పెడతామన్నారు. జైలుకు పంపుతామని, రూ.లక్ష కోట్లు వసూలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకూ ఒక్క కేసులోనూ చర్యలు తీసుకోలేదు. మరి ఆ ఆరోపణలు ఏమయ్యాయి?, దర్యాప్తు ఎక్కడికి పోయింది?. ఇప్పుడు తమ అసమర్థతను దాచుకోవడానికి బీజేపీపై నెపం వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీగా బాధ్యత కాంగ్రెస్‌దే. వేరే వాళ్లపై నెట్టడం కాదు, తెలంగాణ ప్రజలకు హామీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అమలు చేయాల్సిన ప్రజాస్వామ్య బాధ్యత ఆ ప్రభుత్వానిదే' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

శత్రు దేశాలపై ఇరాన్ క్షిపణుల వర్షం

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: పశ్చిమాసియా యుద్ధం మరింత ఉధృతమైంది. ఇరాన్ శత్రుదేశాలపై శనివారం భీకరదాడులకు దిగింది. అమెరికాకు చెందిన ఎఫ్15ఈ ఫైటర్ జెట్‌ను నేలకూల్చింది. దీంతో యుద్ధ విమానంలోని ఇద్దరు పైలట్లు కిందకు దూకేశారు. వీరిలో ఒకరిని అమెరికా రక్షించినట్టు ఇజ్రాయెల్ మీడియా కథనాలు తెలిపాయి. మరొకరి కోసం గాలిస్తున్నట్టు పేర్కొన్నాయి. అయితే పైలట్ల రెస్క్యూ కోసం వచ్చిన అమెరికా జెట్‌ను కూడా కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. పైలట్లను పట్టుకున్న వారికి భారీ రివార్డు అందిస్తామని ఆఫర్ ఇచ్చింది. మరోవైపు, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు ముమ్మరం చేసింది. కువైట్‌లోని ఆయిల్ రిఫైనరీ, డీశాలినేషన్ ప్లాంట్ (ఉప్పు నీటి శుద్ధి కేంద్రం)పై దాడులు చేసింది. దుబాయ్‌లోని ఒరాకిల్ డాటా సెంటర్‌పైనా విరుచుకుపడింది. ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌పై క్షిపణులతో దాడి చేసింది.

ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేసిన ఇరాన్

ఇదివరకే అమెరికాకు చెందిన కీలక యుద్ధ విమానం ఎఫ్ 35 జెట్‌ను నేలకూల్చి ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేసిన ఇరాన్.. తాజాగా ఎఫ్15ఈ జెట్‌ను కూల్చివేసింది. ఖతమ్ అల్ అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్‌ను ఉటంకిస్తూ ప్రభుత్వ ఆధీనంలోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ జెట్ కూల్చివేత విషయాన్ని వెల్లడించింది. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ ఈ జెట్‌ను లక్ష్యంగా చేసుకుని కూల్చివేసిందని తెలిపింది. కూల్చివేత సమయంలో జెట్‌లో పైలట్‌తో పాటు వెపన్ సిస్టమ్ ఆఫీసర్ (డబ్ల్యూఎస్ఓ) కూడా ఉండగా, వీరిద్దరూ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఒకరు ఇరాన్ కస్టడీలో ఉన్నట్టు ఇరాన్‌కు చెందిన కొన్ని చానల్స్ పేర్కొనగా, పైలట్ కోసం గాలింపు జరుగుతున్నదని మరికొన్ని తెలిపాయి. అయితే కూలిన విమాన శకలాలు, వీడియోలోని దృశ్యాలు ఆధారంగా కూలింది ఎఫ్15ఈ అని అధికారులు నిర్ధారించారు. దీని ఖరీదు రూ. 270 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా.

కువైట్‌లో ఆయిల్ రిఫైనరీ ధ్వంసం

గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తూ ఉంది. కువైట్‌లోని రిఫైనరీపై భీకర దాడులు చేసింది. మినా అల్ అహ్మదీ రిఫైనరీపై శుక్రవారం ఉదయమే ఇరాన్ డ్రోన్ల ద్వారా దాడులు జరిపి ధ్వంసం చేసింది. దీంతో రిఫైనరీలోని మూడు యూనిట్లు మంటల్లో చిక్కుకున్నాయి.

ఇజ్రాయెల్‌లో మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడి

టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌పై కచ్చితమైన దాడి నిర్వహించినట్టు ఇరాన్ మిలిటరీ ప్రకటించింది. తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ దాడిలో మొసాద్ ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. అయితే దీనిని ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించ లేదు.

ఒరాకిల్ డాటా సెంటర్‌పై దాడి

ఒక వైపు 30 వేల మందికి ఉద్వాసన పలికి టెక్ సంస్థ ఒరాకిల్ ప్రకంపనలు సృష్టించగా, దానిపై దాడి చేసి ఇరాన్ సంచలనం సృష్టించింది. దుబాయ్‌లోని ఒరాకిల్, బహ్రెయిన్‌లోని అమెజాన్ సంస్థల డాటా సెంటర్లపై ఐఆర్‌జీసీ దాడులు చేసినట్టు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది.

అబుదాబిలో ఐదుగురు భారతీయులకు గాయాలు

క్షిపణి శకలాలు పడి అబుదాబిలో శుక్రవారం ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. శత్రు దేశ ఆయుధాలను అడ్డుకునే క్రమంలో అజ్బాన్‌లో శకలాలు పడి పలువురు గాయపడ్డారని, అందులో ఐదుగురు భారతీయులకు స్వల్పంగా గాయాలైనట్టు సమాచారం.

'రామాయణ'లో సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ ఒదిగిపోయారు. షూటింగ్ తొలిరోజు సీత గెటప్‌లో సాయిపల్లవిని చూసినప్పడే ఈ పాత్రకు ఇంతకంటే మంచి నటిని తీసుకోలేమని అర్థమైంది. ఇక యశ్‌కు స్టార్‌డమ్‌తో పాటు రావణుడి పాత్రకు కావాల్సిన స్క్రీన్ ప్రజెన్స్ ఉంది.

- రణ్‌బీర్ కపూర్

2047 నాటికి దక్షిణాసియా..

టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

నారాయణపేట చేనేత వరకు ఎన్నో ఇక్కడ ఉన్నాయని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులు...

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దఎత్తున సహకరిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల చెప్పారు. చేనేతలకు తమ ప్రభుత్వం చేతినిండా పని కల్పిస్తోందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులను తెలంగాణ నేతన్నలు ఉత్పత్తి చేస్తున్నారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ ఫ్యాషన్ కారిడార్లు నిర్మిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.

తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలి

తాము ప్రపంచస్థాయి ఫ్యాషన్ కారిడార్లు, సర్క్యూలర్ హబ్స్‌ను నిర్మిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఎంత ఉత్పత్తి చేస్తామని అడగొద్దని ఎంత నాణ్యతతో వస్త్రాలు తయారు చేస్తామో చూడాలన్నారు. ఇక్కడ ఒక ఎకో సిస్టమ్‌ను నిర్మిస్తున్నామన్న ఆయన మేడ్ ఇన్ తెలంగాణ అనేది కేవలం లేబుల్ మాత్రమే కాదు అది విశ్వసనీయతకు, నైతిక శ్రమకు భరోసా అని చెప్పారు. చేనేత పరిశ్రమ ఆత్మ దెబ్బతినకుండా తమ ఆర్థిక వ్యవస్థలను వృద్ధి చేసుకోగలమనే భరోసాకు అది ఒక ప్రతీక అని అన్నారు. పర్యావరణ పరిరక్షణే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యతన్న సీఎం తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణ రావు పాల్గొన్నారు.

ఏఐ ముప్పును ఎదుర్కొనడానికి

ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఏవీఎన్‌లేక్‌ఫీల్డ్‌గ్లోబల్‌స్కూల్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పరిస్థితులకు అనుగుణంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని వివరించారు. ఏఐ సునామీలో దేశం ఎదుర్కోబోయే సమస్య ఎంత తీవ్రమైందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని పిలుపునిచ్చారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రతి గ్రామంలోనూ విద్య అందుబాటులో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఎక్కడ విఫలమయ్యామో ప్రజా ప్రతినిధులు అందరూ ఆలోచన చేయాలి. పరిస్థితులకు అనుగుణంగా కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాలి. వ్యవస్థను ఎంపవర్ చేయాల్సిన అవసరముంది. తెలంగాణ ప్రభుత్వం విద్యపైన ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తిని చూపుతోంది. అందులో భాగంగానే వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను, ఒక్కో పాఠశాలలో 2500 విద్యార్థులు చదువుకునేలా నిర్మాణాలు ప్రారంభించాం. ఇప్పటికే 59 స్కూల్స్ పనులు ప్రారంభించాం."అని అన్నారు. మూడో తరగతి చదువుతున్న విద్యార్థి ఒకటో తరగతి పుస్తకాన్ని చదవలేని పరిస్థితి ఉందని, 6వ తరగతిలో ఉన్న విద్యార్థి 3వ తరగతి పుస్తకం చదవలేకపోతున్నాడని, విద్యలో నాణ్యత తగ్గుతోందని, ఈ పరిస్థితి దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరం అని అన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం 1 లక్షా 8 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. బడ్జెట్లో 8.3 శాతం నిధులు విద్యపైన ఖర్చు పెడుతున్నాం. ప్రైవేటు విద్యా సంస్థల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ విధానం లేదని అన్నారు. 'రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుంటే, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం విఫలం చెందడం వల్లే ప్రైవేటు వైపు వెళుతున్నారు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా వంద ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి విధానం తీసుకొస్తున్నాం. 1.34 కోట్ల జనాభా కలిగిన హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో పాఠశాలలను రేషనలైజేషన్ చేసి ప్రయోగాత్మకంగా మోడల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నాం.' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలు సక్సెస్ కావడానికి నర్సరీ, ఎల్ కేజీ వంటి విధానంతో పాటు రవాణా సౌకర్యం కూడా ఒక కారణం. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటికి తోడు బ్రేక్ ఫాస్ట్, లంచ్, అది కూడా మంచి పోషకాహారాన్ని అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. 'విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. క్రీడల్లో రాణించిన వారిని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. 2034 లో ఒలింపిక్స్ భారతదేశంలో నిర్వహించాలని ప్రధానమంత్రి ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం... 'అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, వేం నరేందర్ రెడ్డి, రఘునందన్ రావు, చామల కిరణ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీల హక్కులను కాలరాస్తూ కేరళకు వెళ్లి గొప్పలా?

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 3: ఎస్టీల భూములు లాక్కుంటూ, వారి హక్కులను కాలరాస్తూ కేరళకు వెళ్లి గొప్పలు చెప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగదని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. కొడంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటినీ నెరవేర్చలేదని ఆరోపించారు. కొడంగల్ ప్రాంతంలోని గిరిజనులు ఆత్మగౌరవంగా భావించే లోకామసంద్ మహరాజ్ బావోజీ దేవాలయాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడిన హరీష్ రావు, గతంలో ఆ దేవాలయానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కృషితో, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 8 కోట్లతో వాగుపై బ్రిడ్జి నిర్మించారని తెలిపారు. అలాగే గుడి అభివృద్ధికి రూ. 80 లక్షలు, బంజారా భవన్ నిర్మాణానికి రూ. 50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. లంబాడా పోరాట సమితి దశాబ్దాలుగా పోరాడినా, కిరణ్ కుమార్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులు గిరిజన సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం 3100 గిరిజన గూడెంలను గ్రామ పంచాయతీలుగా మార్చిందని, సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించిందని పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనని, ఆరు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చామని తెలిపారు. మార్కెట్ కమిటీల్లో, వైన్ షాపుల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించిందీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. కొడంగల్ తండాల్లో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించామని, ఆడబిడ్డల విద్య కోసం డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్టీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ. 2730 కోట్లు కేటాయించినట్లు చూపించి, వాస్తవంగా కేవలం రూ. 52 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని ఆరోపించారు. రెండున్నరేళ్లలో ఒక్క ఎస్టీకి కూడా ఆర్థిక సాయం అందలేదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడంలేదని విమర్శించారు. సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ. 100 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని అన్నారు. ఓట్ల సమయంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక కొడంగల్‌లో గిరిజన భూములనే లాక్కుంటోందని హరీష్ రావు మండిపడ్డారు. జైళ్లలో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగాలు చేస్తూ ఇదేనా ఎస్టీలపై ప్రేమ అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కేరళలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్నారని, కానీ వాస్తవంగా రైతు రుణమాఫీ, మహిళలకు రూ. 2500, రైతు భరోసా, పెన్షన్ పెంపు వంటి ఏ హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. అసెంబ్లీలోనే తమ ప్రభుత్వం 16 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని ఒప్పుకుందని, రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అని తేలిపోయిందని అన్నారు. ఏ గ్రామంలో వందశాతం రుణమాఫీ జరిగిందో చూపించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు మూడు సార్లు ఇవ్వలేదని, యాసంగి బోనస్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు వంటి పథకాలు నిలిపివేశారని అన్నారు. గత రెండు సీజన్లలో నీటిని లిఫ్ట్ చేయకుండా వదిలిపెట్టడం వల్ల పాలమూరు ప్రజలు నష్టపోయారని, ఇకపై అలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

అడ్డగోలుగా ఫీజుల భారం

మొదటిపేజీ తరువాయి

రెండున్నరేళ్లు అయినా ఇప్పటి వరకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చే ప్రయత్నమే చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్య కమిషన్ అతి చెత్త నివేదిక ఇచ్చిందని.. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి అనే సిఫార్సు మాత్రమే ఆమోదయోగ్యమైనదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల దోపిడీని ప్రోత్సహించిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫీజుల దోపిడీని ప్రోత్సహిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఒకే సారి 40 శాతం ఫీజులు పెంచితే పేద, మధ్యతరగతి పిల్లల తల్లితండ్రుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల పెంచుతున్న స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రుల జీతాలు పెరగడం లేదన్నారు. 7 శాతం నుంచి 8 శాతం ఫీజు మాత్రమే పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి తప్ప అంతకు మించి ఫీజుల దోపిడీకి సహకరించొద్దన్నారు.

తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం

కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ ఏర్పాటుతో తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కాలేజీల యాజమాన్యాలు ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఏటా భారీగా స్కూల్ ఫీజులు పెంచుతూన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు వాటిలో పని చేస్తున్న టీచర్లు, ఉద్యోగుల జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. నారాయణ, చైతన్య లాంటి స్కూల్స్ లో లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారని, ఏటా వందల కోట్ల వ్యాపారం చేస్తున్న ఆయా సంస్థలు వివిధ పేర్లతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొడుతున్నాయని చెప్పారు. కనీసం మంచి ఫుడ్, టీచర్లకు పీఎఫ్, మ్యాచింగ్ గ్రాంట్స్ కూడా సరిగా ఇవ్వటం లేదన్నారు. వేలాది మంది విద్యార్థులకు నారాయణ, చైతన్య లాంటి స్కూల్స్ లో ఒకే చోట ఫుడ్ వండుతున్నారని, వాటిపై దాడులు చేసి విద్యార్థులకు మంచి భోజనం పెట్టే స్థాయిలో కూడా మన ప్రభుత్వాలు లేవన్నారు. విద్యార్థుల తల్లితండ్రులను గౌరవించని స్కూల్స్ పై రైడ్స్ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ లో తెలంగాణ వారికి కనీసం ధోబిగా కూడా అవకాశం ఇవ్వటం లేదన్నారు. అలాంటి స్కూల్స్ కు పర్మిషన్ ఇవ్వొద్దని తేల్చిచెప్పారు. తెలంగాణ వారికి ఎంప్లాయిమెంట్ ఇవ్వని స్కూల్స్ మనకెందుకని ప్రశ్నించారు. కార్పొరేట్ స్కూల్స్ సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ లు పెట్టుకొని రూ.2 వేల విలువైన పుస్తకాలను రూ.15 వేలకు అమ్ముతున్నారని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, ప్రైవేట్ టీచర్ల హక్కుల సాధన కోసం జాగృతి తరఫున పోరాటం చేస్తామన్నారు.

ప్రయివేటు కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

ప్రభుత్వం ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించలేదనే కారణంగా ప్రయివేటు ప్రొఫెషనల్ కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపొద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ప్రయివేటు కాలేజీలకు రావాల్సిన ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం వాళ్లతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేసి ఇప్పిస్తామన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం తెస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టకపోతే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ అని కవిత అన్నారు. విద్యావ్యవస్థ ఆగమవుతుంటే, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతుంటే కనీసం ముఖ్యమంత్రి రివ్యూ కూడా చేయటం లేదన్నారు. ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నా ముఖ్యమంత్రిలో చలనం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను స్కూల్, కాలేజీల ఫీజుల భారం నుంచి బయట పడేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలకు సిద్ధం

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయని తెలిపారు. తాను బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు నిజామాబాద్ కే పరిమితం చేశారని, అయినా నారాయణ, చైతన్య లాంటి కార్పొరేట్ సంస్థలను నిజామాబాద్ కు రాకుండా అడ్డుకున్నానని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వేర్వేరు పేర్లతో ఆ సంస్థలు నిజామాబాద్ కు వచ్చాయని అన్నారు.

రాజకీయం

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి..

- హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- తెలంగాణలో పెద్దఎత్తున సంక్షేమ పథకాల అమలు
- పుదుచ్చేరి ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, పుదుచ్చేరి, ఏప్రిల్3: ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగం మనకు కల్పించిన గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాలంటే కాంగ్రెస్, డీఎంకే కూటమి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు విద్యలింగంతో కలిసి పుదుచ్చేరి లోని మనవెలి అసెంబ్లీ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన అనంతరామన్ కు, ఎం బాలం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన లక్ష్మీకాంత న్ కు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్థానికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ ని తిరిగి అధికారంలోకి తీసుకురండి పుదుచ్చేరిని రక్షించండి అని ఓటర్లకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కాంగ్రెస్, డీఎంకే పార్టీలతో కూడిన ఎస్‌పీఏ కూటమి ఇచ్చిన హామీల అమలు కు కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. మా కూటమి హామీల అమలు పై ఎన్డీఏ కూటమి చేస్తున్న అసత్యాలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని అన్నారు. పుదుచ్చేరి బంగారు భవిష్యత్తుకు ఎస్పీఏ కూటమిని గెలిపించడం ఒక్కటే పరిష్కార మార్గం అన్నారు. గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని, దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి కేబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని డిప్యూటీ సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయతీర్థ చారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవలసిన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారు, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి గారు, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి గారు, ఇతర అధికారులు పాల్గొన్నారు.
- ప్రతిపక్షం, హైదరాబాద్

ఇప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు వంద సీట్లు ఖాయం

- రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ.. బీజేపీకి చోటు లేదు
- కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు
- కవిత వేరు కుంపటితో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడింది
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్3: తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం అని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడింది. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు.

గ్రూప్1 నియామకాలపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నాం
- ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్3: గ్రూప్ 1 ఉద్యోగ నియామకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల రాష్ట్ర ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నట్టు సీఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొలువుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ 1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట కలిగించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్టశక్తుల కుట్రలను, కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో తొలి గ్రూప్ 1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామన్నారు. గ్రూప్ 1 ఉద్యోగాలు పొందిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసినట్టు సీఎం ప్రస్తావించారు. నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

తెలంగాణ పోలీసుల హ్యాట్రిక్ విజయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్3: ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్లో వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకుని హ్యాట్రిక్ సాధించిన తెలంగాణ పోలీసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ విజయం రాష్ట్ర పోలీసుల నిరంతర కృషి, క్రమశిక్షణకు నిదర్శనమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సీఐడీ పర్యవేక్షణలో నిరంతర శిక్షణ ఈ విజయానికి కారణమైందని, జాతీయ స్థాయిలో మరోసారి ప్రతిభ చాటిన సందర్భంగా ముఖ్యమంత్రి డీజీపీ బి. శివధర్ రెడ్డి, సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా లను అభినందించారు. తెలంగాణ పోలీసుల విజయ పరంపర గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతోంది. 2024 లక్నోలో (ఉత్తరప్రదేశ్), 2025 రాంచీలో (ఝార్ఖండ్) జరిగిన పోటీలతో పాటు తాజాగా 2026లో నాగ్ పూర్ (మహారాష్ట్ర) లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో విజయం సాధించి తెలంగాణ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈసారి నాగ్‌పూర్‌లో జరిగిన డ్యూటీ మీట్ లో తెలంగాణ ప్రతినిధి బృందం అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీతో పాటు యాంటీసాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగాల్లో విజేతగా నిలిచింది. శాస్త్రీయ దర్యాప్తు సహాయాలు, పోలీస్ ఫోటోగ్రఫీ విభాగాల్లో రన్నరప్ సాధించింది.

అధిక ధరకు ఎల్పీజీ సిలిండర్లు అమ్మితే చర్యలు

- గ్యాస్ ఏజెన్సీల్లో అధికారుల తనిఖీలు
- సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తృత తనిఖీలు
- ఇంటికి సరఫరా చేస్తే ఎక్కువ డబ్బులివ్వొద్దు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్3: గ్యాస్ సిలిండర్ల విక్రయాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హైదరాబాద్, రంగారెడ్డి, ఇతర జిల్లాల అధికారులకు విస్తృత తనిఖీలు నిర్వహించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు రంగారెడ్డి జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ పి. రామకృష్ణ ఆధ్వర్యంలో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలో పలుచోట్ల ఎల్పీజీ గోదాములు, డీలర్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా ఎల్పీజీ డీలర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక ధరలకు ఎల్పీజీ సిలిండర్లు విక్రయించరాదని, వినియోగదారులకు సరైన తూకంతోనే సిలిండర్లు అందించవలసిందిగా కఠిన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీలలో లీగల్ మెట్రాలజీ నిబంధనలను ఉల్లంఘించినందుకు మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లాలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సంజయ్ కృష్ణ తనిఖీలు నిర్వహించగా, రంగారెడ్డి జిల్లాలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎం. ప్రవీణ్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో కూడా ఈ తనిఖీలు కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక ధరలకు ఎల్పీజీ సిలిండర్లు అమ్మిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

త్యాగాలను పరిచయం చేసుకోకపోతే రాబోయే తరాలకు తెలిసే ఆస్కారం ఉండదు

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ప్రతిపక్షం, ఎల్బీనగర్, ఏప్రిల్3: ఏ కులమైన, ఏ జాతైనా తన గొప్పతనాన్ని, త్యాగాలను పరిచయం చేసుకోకపోతే రాబోయే తరాలకు తెలిసే ఆస్కారం ఉండదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఎల్బీ నగర్ లో దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి, అణచివేతకు వ్యతిరేకంగా ఆనాటి నిజాంకు ఎదురు వెళ్లి వారి తూటాలకు నేలకొరిగిన మహనీయుడు దొడ్డు కొమురయ్య అని అన్నారు. మన సంస్కృతిని, సాంప్రదాయాలను వెలుగెత్తి చాటిన మహనీయుడు చుక్క సత్తన్న. చుక్క సత్తన్న చెప్తుంటే అన్ని కులాల వారు, వారి కథలు వినేవారు అని తెలిపారు. రోజులు మారుతున్న కూడా ఇంకా ఆ బట్టలని, సంస్కృతిని, సంప్రదాయాన్ని గౌరవించుకుంటున్న జాతి కురుమ జాతి. ఇలానే మరింత ఐక్యత, పట్టుదలతో ముందుకు పోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్, కొప్పుల నరసింహారెడ్డి, శ్యామ్, ఆదికృష్ణ, వెంకన్న, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఈగల్ టీం తనిఖీలు

- గచ్చిబౌలిలోని పలు పబ్బులపై దాడులు
- మొత్తం 64 మందికి డ్రగ్స్ టెస్టు
- ఎనిమిది మందికి పాజిటివ్
- వారిని పీఎస్‌కు తరలించిన పోలీసులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్3: మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా తెలంగాణ ఈగల్ టీం పోలీసులు హైదరాబాద్‌లో నిఘాను ముమ్మరం చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కొండాపుర్లోని అరెనా పబ్‌లో అత్యాధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్ల ద్వారా మొత్తం 64 మంది అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా 8 మందికి పాజిటివ్ అని తేలింది. పబ్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ వినియోగం జరుగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు.

డ్రగ్స్ వినియోగిస్తే చర్యలు తప్పవు

నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద పలు కేసులు నమోదు చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువకులు పబ్‌కు వచ్చేముందే మాదకద్రవ్యాలు సేవించారా? డ్రగ్స్ వీరికి ఎలా లభిస్తున్నాయి? అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. యువకులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పబ్ కల్చర్ పేరుతో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని అన్ని ప్రధాన పబ్‌లపై నిరంతరం నిఘా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఐఏఎస్ అధికారిణి కుమారుడు : గంజాయి, బెంజోడియాజెపిన్, మెథాంఫెటమైన్ వంటి ప్రమాదకర మత్తుపదార్థాలను వినియోగించినట్లు పరీక్షల్లో తేలిందని ఈగల్ పోలీసులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. డ్రగ్ టెస్ట్ చేయగా పాజిటివ్ అని తేలిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిణి కుమారుడు ఉన్నట్లు సమాచారం.

మత గ్రంథాల బోధనలు ఆచరణీయం: కెఎల్ఆర్

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 3: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడలో కేఎల్ఆర్ క్రైస్తవ సోదరులు, సోదరీమణులకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. క్రైస్తవ మతంలో అత్యంత పవిత్రమైన ఈరోజు... మానవాళి పాపల విముక్తి కోసం క్రీస్తుకు శిలువ వేయబడిన దినం. సమాధి నుంచి సజీవంగా వచ్చిన తర్వాత క్రీస్తును ఆరాధిస్తూ... గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం)ను జరుపుకుంటున్నారు. పవిత్రమైన ఈరోజున క్రైస్తవ సోదరులు ఉపవాసం ఉండి చర్చిల్లో నాటి నుంచి నేటి వరకు ప్రార్థనలు చేస్తున్నారని కేఎల్ఆర్ గుర్తు చేశారు. అన్ని మతాలు శాంతి సమరస్యాలను కోరుకుంటున్నాయని.. ప్రజలంతా శాంతితో సుఖ సంతోషాలతో ఉండాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని మతాల పండుగలను గౌరవిస్తూ... వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని కిచ్చెన్న కొనియాడారు.

మావిగన్' రాష్ట్ర అభివృద్ధి మంత్రం. దాన్ని తట్టుకోలేకే ఎల్లో బ్యాచ్ ట్రోలింగ్ చేస్తోంది. జగన్ ప్రతిపాదనపై చర్చ జరుగుతోంది. 'మావిగన్'ను ప్రజలు అమోదించే పరిస్థితి కనిపిస్తోంది. అమరావతి ఇప్పట్లో పూర్తయ్యేది కాదు. చంద్రబాబు అదే చెప్పారు. 7భవనాలతో సరిపెట్టాలని చూస్తున్నారు. నవ నగరాలు ఏమయ్యాయో చెప్పాలి. 'మావిగన్'తో ఆయనకు భయం పట్టుకుంది.

- వైసీపీ నేత అంబటి రాంబాబు

ఓపెన్ వాయిస్

రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?'' అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు'' అని అన్నారు. చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు. ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది. ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు. యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు? నిపుణులు ఏమంటున్నారు? ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవు సామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి. లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి. వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది. ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు. భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది. కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు. ''యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు..''చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు. ''మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం'' అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు ''లివ్‌ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్ ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్‌ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది'' అని చెప్పారు. యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు'' అని పూజా ప్రజాపతి అన్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
04.04.2026

నేటి విద్యా వ్యవస్థలో నైతిక విలువల క్షీణత: కారణాలు పర్యవసానాలు

కాళేశ్వరం కృష్ణమూర్తి
9705196097

భారతీయ సంస్కృతిలో "ఆచార్య దేవోభవ" అన్న సూక్తికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ జన్మకు ఒక సార్థకతను, క్రమశిక్షణను ఇచ్చేది ఉపాధ్యాయుడే. కానీ, నేటి ఆధునిక కాలంలో తరగతి గది ముఖచిత్రం మారిపోయింది. ఉపాధ్యాయుడి పట్ల భయం, భక్తి, గౌరవం అనేవి అరుదైపోతున్నాయి. విద్యార్థుల ప్రవర్తనలో వస్తున్న ఈ ప్రతికూల మార్పులకు కేవలం వారిని మాత్రమే నిందించలేము. దీని వెనుక సోషల్ మీడియా మాయాజాలం, తల్లిదండ్రుల అతి గారాభం, మరియు చలనచిత్రాల ప్రభావం వంటి బలమైన కారణాలు ఉన్నాయి. వీటిని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సోషల్ మీడియా మిథ్యా లోకంలో

బందీ అవుతున్న బాల్యం:
నేడు విద్యార్థుల చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఒక నిత్యావసర వస్తువుగా మారింది. కానీ అది విజ్ఞాన భాండాగారం కంటే ఎక్కువగా 'వ్యసనం'గా మారుతోంది.

ఏకాగ్రత లోపం : సోషల్ మీడియాలో వచ్చే 30 సెకన్ల రీల్స్, షార్ట్ వీడియోలకు అలవాటు పడిన విద్యార్థులకు, 40 నిమిషాల పాటు ఉపాధ్యాయుడు చెప్పే పాఠం వినడం ఒక శిక్షలా అనిపిస్తోంది. తక్షణ వినోదాన్ని కోరుకునే మనస్తత్వం వల్ల లోతైన విజ్ఞానం పట్ల వారికి ఆసక్తి తగ్గుతోంది.

తప్పుడు రోల్ మోడల్స్: సోషల్ మీడియాలో అసభ్యకరంగా ప్రవర్తించేవారు, పెద్దలను హేళన చేసేవారు 'వైరల్' అవ్వడం చూసి, విద్యార్థులు కూడా అదే గొప్ప అనుకుంటున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడిని వెక్కిరించడం లేదా ప్రాంక్ చేయడం వల్ల తాము కూడా ప్రాచుర్యం పొందుతామని భావించడం విచారకరం.

డిజిటల్ అడిక్షన్: గంటల తరబడి ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల విద్యార్థుల్లో సహనం నశిస్తోంది. ఉపాధ్యాయుడు ఏదైనా ప్రశ్న అడిగినా లేదా తప్పును సరిదిద్దినా, దానిని భరించలేక ఎదురుతిరిగే స్వభావం పెరుగుతోంది.

తల్లిదండ్రుల అతి గారాభం: క్రమశిక్షణకు గొడ్డలిపెట్టు పిల్లల పట్ల ప్రేమ ఉండటం సహజం, కానీ అది 'విచక్షణ లేని గారాభం'గా మారినప్పుడు సమస్యలు మొదలవుతాయి.

సమర్థించే ధోరణి: గతంలో ఉపాధ్యాయుడు విద్యార్థిని మందలిస్తే, తల్లిదండ్రులు ఆ గురువుకు మద్దతు ఇచ్చి "మా వాడు తప్పు చేస్తే ఇంకాస్త గట్టిగానే చెప్పండి" అనేవారు. కానీ నేడు, చిన్న మందలింపునకే తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను నిలదీస్తున్నారు. ఇది విద్యార్థికి "నన్ను ఎవరూ ఏమీ చేయలేరు, మా నాన్న చూసుకుంటాడు" అనే అహంకారాన్ని ఇస్తోంది.

శిక్షకు భయం: చట్టాలు, నిబంధనల పేరుతో ఉపాధ్యాయులను కట్టడి చేయడం వల్ల వారు విద్యార్థులను సరిదిద్దడానికి వెనుకాడాల్సి వస్తోంది. తల్లిదండ్రుల అతి జోక్యం వల్ల ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పి వెళ్ళిపోయే 'సిలబస్ మిషన్లు'గా మారుతున్నారు తప్ప, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

సినిమా ప్రభావం: హింస ప్రేమ అనే భ్రమలు చలనచిత్రాలు యువతపై, ముఖ్యంగా విద్యార్థులపై చూపించే ప్రభావం ఊహాతీతం.

హీరోయిజం : అనేక సినిమాల్లో హీరోలు ఉపాధ్యాయులను ఎగతాళి చేయడం, కాలేజీ రూల్స్ పాటించకపోవడం, పెద్దల పట్ల అమర్యాదగా ప్రవర్తించడమే 'స్టైల్'గా చూపించబడుతోంది. విద్యార్థులు తమకు తెలియకుండానే ఆ పాత్రలను అనుకరిస్తూ తరగతి గదుల్లో ప్రవర్తిస్తున్నారు.

హింస పట్ల ఆకర్షణ: యాక్షన్ సినిమాల్లోని హింసను చూసి విద్యార్థుల్లో ఆవేశం, మొండితనం పెరుగుతున్నాయి. తోటి విద్యార్థులతో లేదా ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగడం గొప్ప విషయంగా భావిస్తున్నారు.

ప్రేమ పేరుతో పెడదోవ: చదువుకోవాల్సిన వయసులో సినిమాల్లో చూపించే అవాస్తవిక ప్రేమకథల పట్ల ఆకర్షితులై, తమ లక్ష్యాలను పక్కన పెడుతున్నారు. దీనివల్ల చదువుపై అనాసక్తి పెరిగి, అడిగే గురువు శత్రువులా కనిపిస్తున్నాడు.

చదువుపై అనాసక్తి: విజ్ఞానం కంటే వినోదానికే ఓటు నేటి విద్యా విధానం కేవలం మార్కుల కోసం, ర్యాంకుల కోసం సాగే పరుగు పందెంలా మారింది.

విలువలు లేని విద్య: విద్యా సంస్థలు కేవలం ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నాయి తప్ప, నైతిక విలువల బోధనకు సమయం ఇవ్వడం లేదు. ఫలితంగా విద్యార్థులకు చదువు అనేది ఒక భారంగా మారుతోంది.

లక్ష్యం లేని ప్రయాణం: భవిష్యత్తులో ఏం కావాలి? సమాజానికి ఎలా ఉపయోగపడాలి? అనే స్పష్టత లేకపోవడం వల్ల విద్యార్థులు వినోద సాధనాల వైపు మళ్లుతున్నారు. చదువుపై గౌరవం లేని చోట, చదువు చెప్పే గురువుకు గౌరవం ఎక్కడ ఉంటుంది?

లోతైన విశ్లేషణ: పర్యవసానాలు ఏమిటి?

గురువును గౌరవించని విద్యార్థి క్రమశిక్షణను కోల్పోతాడు. క్రమశిక్షణ లేని సమాజం ఎప్పటికీ అభివృద్ధి చెందదు. నేడు తరగతి గదిలో మొదలైన అగౌరవ భావన, రేపు సమాజంలో చట్టాల పట్ల, పెద్దల పట్ల తిరుగుబాటుగా మారుతుంది. ఇది దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. ఉపాధ్యాయుడు భయం భయంగా పాఠాలు చెప్పే పరిస్థితి వస్తే, ఆ దేశంలో విద్యా ప్రమాణాలు దిగజారిపోతాయి.

పరిష్కార మార్గం ఎక్కడ ఉంది?

ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే కేవలం ఉపాధ్యాయులే కాదు, సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలి.

తల్లిదండ్రుల పాత్ర: పిల్లలకు ఇంట్లోనే విలువలు నేర్పాలి. ఉపాధ్యాయుడు మందలించడం విద్యార్థి క్షేమం కోసమేనని గ్రహించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలి.

సోషల్ మీడియా నియంత్రణ: పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చూస్తున్నారో పర్యవేక్షించాలి. వారికి డిజిటల్ క్రమశిక్షణను అలవాటు చేయాలి.

నైతిక విద్య: పాఠ్యప్రణాళికలో కేవలం సైన్స్, మ్యాథ్స్ మాత్రమే కాకుండా, కథలు, పురాణాలు మరియు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రల ద్వారా నైతిక విలువలను బోధించాలి.

సామాజిక బాధ్యత: సినిమాలు మరియు మీడియా కూడా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలి. ఉపాధ్యాయుడి గౌరవాన్ని పెంచే విధంగా కథనాలు, దృశ్యాలు ఉండాలి.

ఉపాధ్యాయుడు ఒక దీపం లాంటివాడు. ఆ దీపం వెలుగులోనే విద్యార్థి తన భవిష్యత్తును చూసుకోగలడు. ఆ దీపాన్నే ఆర్పేయాలని చూస్తే చీకటి మిగిలేది విద్యార్థి జీవితంలోనే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మరియు సమాజం ముగ్గురూ కలిసికట్టుగా కృషి చేసినప్పుడే 'గురు దేవోభవ' అన్న సూక్తికి మళ్ళీ పునర్వైభవం లభిస్తుంది.

(వ్యాసరచయిత తెలుగు భాషా నిపుణులు, హనుమకొండ)

చిరునవ్వుల చిరునామా ఫిన్లాండ్!

సుధాకర్.ఏ.వి
9000674747

ఫిన్లాండ్ దేశం వరుసగా తొమ్మిదో సంవత్సరం కూడా ప్రపంచంలోని సంతోషకరమైన దేశాలలో మొదటి స్థానంలో నిలిచింది. ఐక్యరాజ్యసమితి వార్షిక సంతోష సూచికలో ఫిన్లాండ్, ఐస్లాండ్ డెన్మార్క్, కోస్టారికా, స్వీడన్, నార్వే, నెదర్లాండ్స్, ఇజ్రాయిల్, లక్సెంబర్గ్ , స్విట్జర్లాండ్ 10 సంతోషకరమైన దేశాలలో ఉన్నాయి. అదే సమయంలో ఆఫ్ఘనిస్తాన్ అత్యంత అసంతృప్తికరమైన దేశాలలో ఒకటిగా నిలిచింది. అయితే సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ ఎందుకు మొదటి స్థానంలో ఉంటున్నదనే ప్రశ్న అందరిలో మెదులుతుంది. ది ఇండిపెండెంట్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐక్యరాజ్యసమితి బృందం ఈ నివేదికను రూపొందించడానికి గ్లోబల్ సర్వే నుండి డేటాను సేకరించింది. ప్రపంచంలోని 150 దేశాల జీడీపీ, అక్కడి ప్రజల దీర్ఘాయువు, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, అవినీతి తదితర అంశాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. దీనిలో పేర్కొన్న వివరాల ప్రకారం ఫిన్లాండ్‌లో నేరాల రేటు తక్కువగా ఉంది. 147 దేశాలతో నివేదికను విడుదల చేయగా, అందులో భారత్ 116వ స్థానంలో వుంది. గతేడాది 118వ స్థానంతో సరిపెట్టుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి భారత్ తన స్థితిని స్వల్పంగా మెరుగు పరుచుకుంది. 2024లో 118వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది 116వ స్థానానికి ఎగబాకింది. దేశంలో అవినీతి తగ్గుదల, ప్రజల్లో దాతృత్వం పెరగడం, వ్యక్తిగత స్వేచ్ఛ, తలసరి ఆదాయం పెరగడం వంటి అంశాలు భారత్ ర్యాంకు మెరుగు పడటానికి దోహదపడ్డాయి. అయితే పొరుగు దేశాలైన నేపాల్ 99వ స్థానంలో ఉండగా, పాకిస్థాన్ 104వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ముఖ్యంగా ఈ రెండు దేశాలు భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉండటం గమనార్హం. అమెరికా 23వ స్థానంలో వుండగా, కెనడా 25, బ్రిటన్ 29 స్థానాలను కైవసం చేసుకున్నాయి. పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై ఆంక్షలు విధించాలని ఇందుకోసం చట్టాలు, నిబంధనలను రూపొందించాలని అనేక దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా కనబరుస్తున్న ప్రభావాలను ఈ ఏడాది వరల్డ్ హ్యాపినెస్ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. అలాగే సంతోషానికి, ఆనందానికి సూచికలుగా ఆరు అంశాలను - తలసరి జీడీపీ, ఆయుర్దాయం, సామాజిక మద్దతు, జీవన ఎంపికల్లో స్వేచ్ఛ, ఉదారత, అవినీతి పట్ల వైఖరి పేర్కొంది. ఇక్కడ సహజ సౌందర్యం ఎక్కువ. పేదరికంతో సతమతమవుతున్నవారు చాలా తక్కువ. ఇంతేకాకుండా ఇక్కడి ఆరోగ్య వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. సమాజ సంరక్షణ కోసం మెరుగైన ప్రభుత్వ సౌకర్యాలు ఉన్నాయి. ఇదే ఫిన్‌లాండ్ సంతోషకరమైన దేశంగా నిలవడం వెనుకగల రహస్యం. హెల్సింకి టైమ్స్ నివేదిక ప్రకారం పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఫిన్లాండ్.. ప్రజలు నివసించడానికి ఉత్తమమైన

దేశం. ఇక్కడి ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి ఇష్టపడతారు. కాబట్టి ఇక్కడ నివసించడం సానుకూల శక్తిని ఇస్తుంది. ఇంతేకాకుండా ఫిన్లాండ్ సంస్కృతి కూడా ఈ దేశాన్ని సంతోషంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఒక నివేదిక ప్రకారం ఇక్కడి సంస్కృతిలో ఒకరికొకరు సహాయం చేసుకోవడం భాగంగా ఉండటంతో ఇది కూడా వారి సంతోషానికి సంబంధించిన మరో రహస్యంగా నిలిచింది. ఫిన్లాండ్‌లో నేరాలకు సంబంధించి అతి తక్కువ కేసులు నమోదవుతుండటంతో ఇక్కడి ప్రజలు తమను తాము మరింత సురక్షితంగా భావిస్తారు. ఇక్కడ విద్యావ్యవస్థ మెరుగ్గా ఉండడంతో యువతకు ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయి. నిరుద్యోగం గురించి ఇక్కడ చర్చజరగకపోవడం విశేషం. మనం మన దేశం లాగే ఫిన్లాండ్‌ను పోల్చి చూస్తే మన దేశంలో ఎక్కువ గంటలు పని చేయాల్సి ఉంటుంది. దేశంలో చాలా కంపెనీలలో ప్రజలు వారానికి 48 గంటలు పని చేస్తారు. అంటే వారానికి 6 రోజులు రోజుకు 8 గంటలు పని చేసి, ఒక రోజు సెలవు తీసుకోవాలి. అయితే ఫిన్లాండ్‌లో ప్రజలు వారానికి గరిష్ఠంగా 40 గంటలు పని చేస్తారు. చాలా కంపెనీలలో వారానికి 5 రోజులు మాత్రమే పని ఉంటుంది. అది కూడా రోజుకు 8 గంటలు. ఇది కాకుండా ఫిన్లాండ్‌లోని ఉద్యోగులకు సంవత్సరంలో 24 నుండి 30 స్పెషల్ హాలిడేస్ లభిస్తాయి. వీటిని వెకేషన్ హాలిడేస్ అంటారు. ఈ కాలంలో ఒక వ్యక్తి పని చేయాలనుకుంటే అతనికి రోజుల లెక్కన కంపెనీ జీతం చెల్లిస్తుంది. మన దేశంలో కూడా సెలవులు ఉంటాయి, కానీ ఒక ఉద్యోగి ఈ రోజుల్లో పనిచేస్తే, చాలా తక్కువ కంపెనీలు మాత్రమే జీతం చెల్లిస్తాయి. వరుసగా తొమ్మిది సార్లు ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా నిలవడం ఫిన్లాండ్ దేశానికే సాధ్యపడింది అనడంలో అతిశయోక్తి లేదు. తమ దేశప్రజల సంతోష రహస్యాలను ప్రపంచంతో పంచుకోవడానికి ఓ అవకాశం కల్పిస్తున్నది. 'చిల్ లైక్ ఏ ఫిన్' పేరుతో ఏడు రోజుల ఫిన్లాండ్ పర్యటనను ఆఫర్ చేస్తున్నది. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది ఫిన్లాండ్. ఈ చాలెంజ్‌లో గెలిచిన వారికి ఫిన్లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన 'లేక్‌ల్యాండ్'లో విహరించే అవకాశం దక్కుతుంది. అదికూడా ఉచితంగా. ప్రయాణ ఖర్చులు మొదలుకొని, వసతి, భోజనం, ఇతర ఖర్చులన్నీ ఫిన్లాండ్ ప్రభుత్వమే భరించనున్నది. వారికి ఆనందంగా జీవించడం ఎలాగో కూడా నేర్పుతుంది. ఫిన్లాండ్ ప్రజలు ప్రకృతితో కలిసి ఎలా జీవిస్తారు? వారి జీవనశైలిలో దాగి ఉన్న అంశాలు ఏమిటి? చిన్న చిన్న విషయాల్లోనూ వారు సంతోషాన్ని ఎలా వెతుక్కుంటారు? వారి మధ్య పెనవేసుకున్న బంధాలు ఎలా ఉంటాయి? అనే విషయాలపై అవగాహన కల్పిస్తుంది. దరఖాస్తు చేయడం కోసం విజిట్ ఫిన్లాండ్' (https://www.visitfinland.com/en/) అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లి, ఒక ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుంది.

(వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ)

పారిశ్రామిక వృద్ధికి ఊహించని ఉప్పెన!

ఇరికి.మహేష్
0000

పారిశ్రామిక ఉత్పత్తి సూచిక పాత డేటా నుండి విభిన్నంగా ఉంది భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి ఫిబ్రవరి 2026లో 5.2% వద్ద సానుకూల ఆశ్చర్యాన్ని కలిగించింది ఇది జనవరి వృద్ధిరేటు కంటే స్వల్పంగా వేగవంతంగా వేగవంతమైనది గత సంవత్సరం నవంబర్ డిసెంబర్ మినహా పారిశ్రామిక ఉత్పత్తి సూచిక ఐ.ఐ.ఐ.టి ప్రకారం ఫిబ్రవరి పారిశ్రామిక పనితీరు దాదాపుగా రెండేళ్లలో అత్యుత్తమంగా ఉంది. ఇది ఎందుకు ఆశ్చర్యపరిచిందంటే ఈ నెలలో ప్రారంభంలో విడుదలైన ఎనిమిది కీలక పరిశ్రమల సూచిక సూచించిన దానికి ఈ పనితీరు చాలా భిన్నంగా ఉంది. ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, బొగ్గ, ఎరువులు, ఉక్కు, సిమెంట్ విద్యుత్తు వంటి ఎనిమిది కీలక రంగాలు ఉమ్మడి వృత్తి ఫిబ్రవరిలో రెండు. మూడు శాతానికి మందగించినది. ఇది జనవరి వృత్తి రేటులో దాదాపు సగం ఈ కీలక రంగాలకు ఐఐటిలో దాదాపు 40 శాతం వెయిటేజ్ ఉంది. కాబట్టి అవి ఐఐపి ని కూడా కిందకు లాగుతాయని అంచనా వేయబడింది అయినప్పటికీ వేరేది జరిగింది దీనిని బట్టి కీలక రంగాల్లో కానివి బాగా రాణించామని తెలుస్తుంది. ముఖ్యంగా ఐ.ఐ.పి లోని తయారీ రంగం ఫిబ్రవరి నెలలో 6% గౌరవప్రదమైన వృద్ధిని నమోదు చేసింది. మూలధనం వస్తువుల రంగం వృద్ధి ఇప్పటికే 8.1% బలమైన పునాదిపై 28 నెలల గరిష్ఠ సాయి అంచనా 12.5% పెరిగినది. ఇవి కార్మిక మూలధన రంగాలకు మంచి సంకేతాలు మరింత ఆందోళన కలిగించే విషయమేమిటంటే వినియోగదారుల డిమాండ్ లోని కొన్ని అంశాలను వ్యతిరేక దిశలో పయనిస్తున్నాయి. వినియోగ మన్నికల వస్తువులు 73% వృద్ధి చెందగా వినియోగ మన్నిక వస్తువులు 0.6 శాతానికి క్షీణించాయి. ఇది వరుసగా రెండు నెలల క్రితం గత ఏడాదిలో ఫిబ్రవరిలో కూడా ఇదే క్షీణించింది. కాబట్టి ఇది గణాంకపరమైన అసాధారణ పథకాలు కాదు. సాధారణంగా రోజువారీగా మన్నికలేని వస్తువులపై చేసే ఖర్చులు ఎక్కువ విచక్షణ ఉంటుంది. కానీ ఇది వినియోగదారుల సెంటిమెంటుకు మెరుగైన కొలమానం ప్రస్తుతానికి కనీసం ఈ డేటా ప్రకారం సెంటిమెంట్ తక్కువగా ఉందని తెలుస్తుంది. జిడిపి కి గృహ వేయం అందించే వాట తగ్గిపోతుందని చూపిస్తున్న కొత్త జాతీయ ఖాతా డేటా తో కూడా ఇది సరిపోతుంది. ఫిబ్రవరిలో పారిశ్రామిక ఉత్పత్తుల సూచి ఐఐటీలో 8 కీలక పరిశ్రమల సూచి ఎక్కువ వ్యతిరేక దిశలో కదిలే కూడా ప్రభుత్వం పరిశీలించాలి. సాధారణంగా ఈ రెండు మధ్య అధిక సంబంధం ఉంటుంది కాబట్టి ఒక వైరుధ్యం వెంటనే గమనించదగినది పరిస్థితులను బట్టి చూస్తే ఫిబ్రవరిలో అయ్యాయి చూపిన బలమైన

పనితీరు ఒక స్వల్పకాలిక అభివృద్ధి మాత్రమే అవకాశం ఉంది. పచ్చిమాసియా సంక్షోభం ఇప్పటికే ఆర్థిక వ్యవస్థ పై ప్రభావం చూపుతుంది. మార్చి నెలకు సంబంధించిన ప్రాథమిక అధిక పునః పరిశీలన ఆర్థిక సూచిక ఆర్థిక వేగంతో మందగమనాన్ని సూచిస్తున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖకు తన నెలవారి ఆర్థిక సమీక్షలో పేర్కొంది. యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందో ఈ మందగమనం అంత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది ఒక స్థానికుల అంశం ఏమిటంటే కొలువబడుతున్న నిరాశాజనకంగా మారినప్పటికీ దానిని కొలిచే విధానం త్వరలోనే మెరుగుపడుతుంది నవీకరించబడిన కొత్త ఐఐపి డేటా శ్రేణి మే నెలలో విడుదల అవుతుంది కొత్త జిడిపి మరియు సిపిఎల్ అందించే ఈ కొత్త ఐఐపి కూడా ఆర్థిక వ్యవస్థ యొక్క మంచి చేయడంతో కూడిన స్పష్టమైన చిత్రాన్ని అందిస్తుందని కచ్చితంగా చెప్పవచ్చు.

(వ్యాసకర్త న్యాయవాది, ఇ.వీ.ఎస్ ఎన్జీవో చైర్మన్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమరయ్య పాత్ర కీలకం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- దొడ్డి కొమరయ్య ఆశయాల స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , ఏప్రిల్ 3 : దొడ్డి కొమరయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ధైర్యసాహసాలు నేటి తరాలకు స్ఫూర్తి దాయకమని అన్నారు. దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లిలోని దొడ్డి కొమరయ్య విగ్రహానికి మంత్రి, కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమరయ్య చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఆయన స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్య వంటి మహనీయుల ఆశయాలను సాకారం చేయడం ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ ఉద్యమానికి నాంది పలికిన అమరవీరుడు, రైతాంగ గళంగా నిలిచిన గొప్ప నాయకుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. యువత ఆయన జీవితం నుంచి ప్రేరణ పొందుతూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అనే విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు చింతా ప్రభాకర్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లు కూన వనిత, సుమలత శ్రీకాంత్,జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం మల్లయ్య, జనరల్ సెక్రటరీ తాటిపల్లి పాండు, బీసీ సంఘం యూత్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికై ఇంటింటికి సీపీఐ

- భారీగా విరాళాలు ఇవ్వండి
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జి కే రామస్వామి

ప్రతిపక్షం, చేవెళ్ల, ఏప్రిల్ 3: భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపుమేరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమం రెండవ రోజు చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి మాట్లాడుతూ ప్రజల కష్టాలు పెరుగుతున్న ఈ సమయంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల సమస్యలు, పేదల బతుకులు కష్టాల్లో కూరుకుపోతున్నా ప్రభుత్వాలు మాత్రం మూగనటకమే ఆడుతున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత గల పాలకులు కార్పొరేట్ శక్తుల ముందు తలవంచి ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. సిపిఐ పార్టీ ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత బలపర్చేందుకు సిద్ధమైంది. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేయడానికి ఆర్థిక సహకారం అత్యవసరం. అందుకే ప్రతి కార్మికుడు, రైతు, యువకుడు, మహిళ ముందుకు వచ్చి "ఇంటింటికి సిపిఐ - ప్రజా సమస్యల పరిష్కారానికి విరాళాలు ఇవ్వండి" అనే పిలుపునకు స్పందించాలి. దోపిడీ పాలనకు చెక్ పెట్టేది ప్రజల ఐక్యతే. సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలకు బలంగా నిలబడేందుకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి ఉద్యమాన్ని బలోపేతం చేయాలి. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభు లింగం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్ బి కే ఎం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల అంతారం గ్రామ వార్డు సభ్యురాలు జయమ్మ పెంటయ్య శ్రీను యాదయ్య బుచ్చయ్య మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి రూ.41 వేల సాయం

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 3: ఎన్నికల హామీని నెర్చడంలో అప్పోజిగూడ 19వ వార్డు కౌన్సిలర్ కల్లెంల జగపతి ఆదర్శంగా నిలిచారు. తాను ప్రకటించిన 'తల్లి దీవెన' పథకం ద్వారా వార్డులోని పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రామ నివాసి వజ్రలింగంహేమలత దంపతుల కుమార్తె సింధుజ వివాహానికి హాజరై, రూ.41,000 విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డులోని ప్రతి ఆడబిడ్డ పెళ్లికి అన్నగా తోడుంటానని వెల్లడించారు. ప్రజా సేవయే తన పరమావధి అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని కౌన్సిలర్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.

చత్రపతి శివాజీ వర్ధంతి దొడ్డి కొమురయ్య జయంతి

- పాల్గొన్న కాకి ఈశ్వర్ ముదిరాజ్

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 3: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ 346 వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నామన్నారు మరియు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ తోపాటు మహేశ్వరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్.కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యుడు స్వర్ణ గంటి సుభాష్.కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుట్ల గారి చందు. తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో బొట్లా దుర్గావరప్రసాదుకు పీహెచ్డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 3 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి దుర్గావరప్రసాదు బొట్లా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ట్రయాజోల్/ఆక్సాడియాజోల్‌లింక్డ్ హైబ్రిడ్ హెటెరోసైక్లిక్ స్కాఫోల్డ్ ల రూపకల్పన, సంశ్లేషణ, జీవసంబంధమైన మూల్యాంకనం' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన సంభావ్య క్యాన్సర్ నిరోధక, యాంటీ బాక్టీరియల్ అనువర్తనాలతో నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనంలో పిరిమిడిన్లు, థియాజోల్స్, ట్రయాజోల్స్, ఆక్సాడియాజోల్స్ వంటి ఔషధపరంగా ముఖ్యమైన నిర్మాణాలను కలిగి ఉన్న అనేక హైబ్రిడ్ హెటెరోసైక్లిక్ అణువుల సంశ్లేషణ, జీవ మూల్యాంకనం ఉన్నాయన్నారు. ఈ అధ్యయనం రొమ్ము (ఎంసీఎఫ్7), ఊపిరితిత్తుల (ఏ549) క్యాన్సర్ కణ తంతువులకు వ్యతిరేకంగా ఆశాజనకమైన ఇన్విట్రో క్యాన్సర్ వ్యతిరేక చర్యను ప్రదర్శించే కొత్త సమ్మేళనాల అభివృద్ధికి దారితీసిందని, కొన్ని ప్రామాణిక మందులతో పోలిస్తే మెరుగైన సైటోటాక్సిసిటీని చూపించినట్టు తెలిపారు. ఈ పరిశోధన మానవ వ్యాధికారక బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా బలమైన యాంటీ బాక్టీరియల్, బయోఫిల్మ్‌నిరోధక లక్షణాలతో కూడిన సమ్మేళనాలను, సాల్మొనెలా టైఫిమురియం, ఎస్చెరిచియా కోలికి వ్యతిరేకంగా గుర్తించదగిన కార్యకలాపాలను కూడా గుర్తించినట్టు వివరించారు. క్యాన్సర్ నిరోధక, యాంటీ బాక్టీరియల్ ఔషధ ఆవిష్కరణలో చికిత్సా ఏజెంట్లుగా మరింత అభివృద్ధి చెందడానికి కొత్తగా సంశ్లేషణ చేసిన హైబ్రిడ్ హెటెరోసైక్లిక్ స్కాఫోల్డ్ ల సామర్థ్యాన్ని ఈ పరిశోధనలు ఎలుగెత్తి చాటాయన్నారు. డాక్టర్ బొట్లా సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు పేర్కొన్నారు.

యువత మహనీయుల బాటలో నడవాలి

- సజ్జన్‌పల్లిలో విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి.
- కాశింబౌలి సర్పంచ్ మాడి రాజేందర్ రెడ్డి

ప్రతిపక్షం,మొయినాబాద్, ఏప్రిల్ 3 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు యువత వారధులుగా నిలవాలని కాశింబౌలి గ్రామ సర్పంచ్ మాడి రాజేందర్ రెడ్డి అన్నారు. యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు. మొయినాబాద్ మండల మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్ బేగరి రాజు, సజ్జన్‌పల్లి అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు కోడిజుట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌కు విగ్రహావిష్కరణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే నేడు తామంతా ప్రజాప్రతినిధులుగా పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేస్తున్నామని కృతజ్ఞతగా పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీన సజ్జన్‌పల్లి చౌరస్తాలో నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల కమిటీ చైర్మన్ బేగరి రాజు మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల మహనీయుల మాసమని, ఈనెల 14న సజ్జన్‌పల్లిలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ యువజన సంఘాల సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విగ్రహావిష్కరణ నిర్వాహకులు కోడిజుట్టు శ్రీనివాస్, మాడి పెంట రెడ్డి మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పట్టా చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం డిమాండ్

ప్రతిపక్షం, రేగొండ, ఏప్రిల్ 3: చనిపోయిన వ్యక్తి పేరు మీద ఉన్న భూమిని నిబంధనలకు విరుద్ధంగా మరొకరి పేరు మీదకు అక్రమంగా పట్టా చేసిన కొత్తపల్లి గోరి మండల తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుర్రం దేవేందర్ డిమాండ్ చేశారు. చిన్నకోడెపాక గ్రామంలోని సర్వే నంబర్లు 257 నుండి 266 వరకు ఉన్న 11:34 ఎకరాల భూమిని 1983లోనే ఐతరాజు రంగనాయకమ్మ ప్రభుత్వానికి విక్రయించారని, అయితే ప్రభుత్వం హద్దులు నిర్ణయించి భూమిని స్వాధీనం చేసుకోకపోవడంతో కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని వారు విమర్శించారు. అక్రమ పట్టాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సదరు భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా, చనిపోయిన ఐతరాజు రంగనాయకమ్మకు చెందిన సర్వే నంబర్లు 268 నుండి 271 వరకు ఉన్న 5:20 ఎకరాల భూమిని, ఫీల్డ్ ఎంక్వయిరీ లేకుండానే పోతరాజు రంగనాయకమ్మగా పేరు మార్చి రేగుల సాంబయ్య పేరిట పట్టా చేయడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం భూభారతి లేదా భూమాత పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయకుండా, వారసులకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వకుండా నేరుగా పట్టా మార్పిడి చేయడంలో ఉన్న ఆంతర్యమేమిటని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఇండ్ల నిర్మాణం కోసం కేటాయించిన, సాగులో లేని ఈ భూమికి హద్దులు కూడా నిర్ణయించకుండానే పట్టా ఎలా చేస్తారని ఎద్దేవా చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సదరు తహసీల్దార్‌పై విచారణ జరిపి, విధులను నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

విలీన గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

- నూతన డివిజన్ల ఏర్పాటు తథ్యం
- మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- సుల్తాన్పూర్ లో కోటి రూపాయలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం
- వడకపల్లిలో 9.80 కోట్ల రూపాయలతో రాక్ పార్క్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 3: అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, సుల్తాన్పూర్, దయార, పటేల్ గూడ, ఐలాపూర్ తండా, జానకంపేట గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ ఈఈ సురేష్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి లతో కలిసి విలీన గ్రామాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు, నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎనిమిది గ్రామాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోనీ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు నత్త నడక కొనసాగడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వడక పల్లి గ్రామంలో గల పురాతన కోటను అభివృద్ధిపరిచేందుకు హెచ్ఎండిఏ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. 9 కోట్ల 80 లక్షల రూపాయలతో కోట చుట్టూ రాక్ పార్కు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అతి త్వరలో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. సుల్తాన్పూర్ గ్రామంలో మోల్డ్ టెక్ పరిశ్రమ సహకారంతో ఒక కోటి రూపాయలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. సుల్తాన్పూర్‌లో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్, మల్లన్న దేవాలయాన్ని అతి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో జనాభాకు అనుగుణంగా మరో ఐదు డివిజన్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టించబోతున్నట్లు తెలిపారు. అనంతరం దయరా గ్రామంలో యూత్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ, రాజు, కృష్ణ, పాండు, శ్రీకాంత్, మల్లేష్, భాస్కర్ గౌడ్, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- రేగొండ ఎస్సై సుధాకర్

ప్రతిపక్షం, రేగొండ, ఎప్రిల్ 3: మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు రేగొండ ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు మరియు ప్రజా ప్రవర్తన నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలైన రోడ్లు, పార్కులు, పాఠశాలల వద్ద మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై (డ్రంక్ అండ్ డ్రైవ్) నిరంతరం తనిఖీలు ఉంటాయని, పట్టుబడితే జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించి ప్రయాణించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని, 18 ఏళ్లు నిండని వారు వాహనాలు నడపడం నిషిద్ధమని పేర్కొన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని ఎస్సై సుధాకర్ కోరారు. నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అమరావతికి వెచ్చించే రూ.2 లక్షల కోట్లలో కేవలం 10,000 కోట్లు 'మావిగన్'కు ఖర్చు చేస్తే మచిలీపట్నం, విజయవాడ,గుంటూరుతో మహానగరం అభివృద్ధి చెందుతుంది. మావిగన్ హైదరాబాద్ , బెంగళూరుతో పోటీపడుతుంది. విశాఖ, విజయవాడ నగరాలను కాదని అమరావతిని శూన్యం నుంచి మొదలు పెడతారా?
- వైసీపీ మాజీ ఎంపీ భరత్

ప్రాంతీయం

సింగూర్ జలాలు సాగు, త్రాగుకు ఇవ్వాలి

- రైతు సంగం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి
- రైతు సంగం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 3: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధరణి భూ సమస్యలు పరిస్కారం చేయని రెవిన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని రైతు సంగం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. నేడు సంగారెడ్డి జిల్లా కేంద్రం లో జరిగిన రైతు సంగం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ సింగూర్ జలాలు సాగు,త్రాగు కు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల వల్ల దేశం,రాష్ట్రంలో రైతాంగాన్ని కాపాడటానికి, వ్యవసాయాన్ని రక్షించడానికి, ఉద్యమాలను రూపకల్పన చేయటానికి కొండాపూర్ లో ఏప్రిల్ 20,21 తేదీల్లో జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. దేశంలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపైన ఆధారపడి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.53 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టగా.. దానిలో వ్యవసాయానికి కేవలం రూ.1.60లక్షల కోట్లు కేటాయించడం దారుణమన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయటం కోసం విద్యుత్ సవరణ చట్టం, ఎరువులపై సబ్సిడీని ఎత్తివేయడం, యూరియాని రైతులకి అందుబాటులో లేకుండా చేయడం, రైతులకు బీమా సౌకర్యం లేకుండా చేయటం వంటి రైతు వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల రైతాంగం దివాళా తీసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ధరణి భూ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రైతు సంగం జిల్లా అధ్యక్షులు రాజయ్య,కార్యదర్శి యాదవ రెడ్డి,ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఏప్రిల్ 3: దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంఘ నాయకులు యాదగిరితో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని అన్నారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని చెప్పారు.ప్రజల హక్కులు,సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని కలెక్టర్ తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో బీసీ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్ ఏప్రిల్ 3 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి నర్సయ్య, వివిధ సంఘాల నాయకులు లక్ష్మణ్, దేవన్న, షేక్ హుస్సేన్, బంగారు సాయిలు, నరాల సుధాకర్, రాజేశ్వర్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానంతో ప్రాణదాతలు కండి

- డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 3: ఈనెల 7 మంగళవారం రోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం(వరల్డ్ హెల్త్ డే) ను పురస్కరించుకొని "రక్తదాన శిబిరం" ఏర్పాటు చేయబడిందని గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరములు పైబడిన యువతి, యువకులు, ఆరోగ్యవంతులు ఎవరైనా రక్త దానం చేయ వచ్చుననీ, 3 నెలలకు ఒక్కసారి రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్తరక్తం లో ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అధికమై వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ పవర్) పెరిగి ఉత్తేజంగా, ఉల్లాసం, ఉత్సాహంగా,సంపూర్ణ ఆరోగ్యవంతులుగా, అవడానికి ఇది ఒక మంచి సువర్ణ అవకాశం అని సూచించారు. కావున అర్హులైన ప్రతి ఒక్కరూ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నపూర్ణ కోరారు.

క్రికెట్ అభిమానుల కోసం ఐపీఎల్ ఫ్యాన్ పార్క్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్ ఏప్రిల్ 3: ఐపీఎల్ క్రికెట్ అంటే ఇష్టపడని అభిమానులు ఉండరు. పట్టణాలలోని స్టేడియంలోకి వెళ్లి చూసి ఆనందించే అవకాశం తక్కువ మందికే ఉంటుంది. కానీ, దేశవ్యాప్తంగా స్టేడియంలోకి వెళ్లి చూడాలని నిరాశ చెందే అభిమానుల కోసం దేశవ్యాప్తంగా 50 నగరాలలో ఈ ఐపీఎల్ ఫ్యాన్ పార్కులు ఏర్పాటు చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ వికాస్ పండిట్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ గురించి వివరించారు. జిల్లా కేంద్రంలో ఈ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేయడం నాలుగవ సారి అని తెలిపారు. ఎటువంటి రుసుము చెల్లించకుండా ప్రత్యక్ష అనుభూతిని పొందవచ్చు అని తెలిపారు. ఈ ఫ్యాన్ పార్కులో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని కేవలం రూ. 100 లకు తక్కువ ఛార్జీలు విధించబడతాయని తెలిపారు. ఇట్టి ఫ్యాన్ పార్క్ లో శని, ఆదివారాలలో జరిగే ఐపీఎల్ మ్యాచ్ లు బిగ్ స్క్రీన్ పైన లైవ్ మ్యాచ్ లు చూపించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, మేనేజర్ దీపక్ దాస్, అంజద్ షేక్, తదితరులు పాల్గొన్నారు.

ఏసు త్యాగం మరవలేనిది

- ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఏప్రిల్ 3: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 11:00 గంటల నుండి ప్రెస్ బీటర్ ఇంచార్జ్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ ప్రార్ధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు బిషప్ ఎమెరిటస్ ఆర్.టి.రెవ.టి. ఎస్ కనక ప్రసాద్ దైవ సందేశాన్ని వినిపించారు. మానవాళి పాప ప్రక్షాళన ఏసు క్రీస్తు తన ప్రాణాలను త్యజించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈస్టర్ కు ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్ ఫ్రైడే గా నిర్వహిస్తారని తెలిపారు. ఈ గుడ్ ఫ్రైడే, గ్రేట్ ఫ్రైడే అని కూడా అంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ చర్చ్ లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర నలుమూల నుండి నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

వదంతులు నమ్మవద్దు

- సిద్దిపేటలో పరిస్థితి ప్రశాంతం
- సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3: సిద్దిపేట పట్టణంలో ప్రస్తుత పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా, పోలీసుల నియంత్రణలో ఉందని సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందకూడదని సూచించారు. సోషల్ మీడియా, వాట్సప్, పేసుబుక్‌లో వచ్చే తప్పుడు వార్తలను ప్రజలు నమ్మకూడదన్నారు. అవాస్తవాలను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

రంగదాంపల్లి లో హైమాస్క్ లైట్ల ప్రారంభం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3 : సిద్దిపేట పట్టణంలోని 3వ వార్డ్ రంగదాంపల్లి ఆధునిక ఐమాక్స్ లైట్లను సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవెరుగు మంజుల రాజనర్సు స్థానిక కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం వారు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి దిశగా మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా ఈ ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో వీధుల్లో వెలుతురు సమస్యలు లేకుండా ఉండేందుకు, ప్రజలు భద్రంగా సంచరించేలా ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.మంత్రి హరీష్‌రావు ఆదేశాల మేరకు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి సదుపాయాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.స్థానిక ప్రజలు ఈ లైట్ల ఏర్పాటుతో సంతోషం వ్యక్తం చేస్తూ, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముత్యాల కనకయ్య ,దబ్బేట శ్రీనివాస్, ఆంజనేయులు,దుర్గారెడ్డి, రమేష్, హరీష్,మహేష్, వార్డ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన గుండె శస్త్ర చికిత్స

- త్రీడీ ఎలక్ట్రో అనాక్టమికల్ మ్యాపింగ్ ద్వారా సర్జరీ

ప్రతిపక్షం, సిద్దిపేట, ఏప్రిల్ 3 : సిద్దిపేట అర్బన్ మండలం సురభి హాస్పిటల్ లో మొట్టమొదటిసారి త్రీడి ఏలోక్ట్రో అనాటామికల్ మ్యాపింగ్ సాంకేతికత వెంట్రిక్యులర్ టాచీకార్డియా (రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్) చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ల బృందం తెలిపారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం నారాయణరావుపేట మండలం నాగర్ కర్నూల్ మరియు నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురికి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వంశీ డాక్టర్ విక్రమ్ (అనాస్తిషియా) ఆధ్వర్యంలో (రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్) ద్వారా అత్యాధునిక చికిత్స నిర్వహించారు. సర్జరీ జరిగిన తర్వాత పెషేంట్స్ క్షేమంగా ఉన్నారని డాక్టర్లు తెలిపారు.

వైన్స్ లో దొంగతనం.. పోలీసుల అదుపులో నిందితులు

ప్రతిపక్షం,సిద్దిపేట, ఏప్రిల్ 3 : సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి సమీపంలోని రాజరాజేశ్వర వైన్స్ లో దొంగతనానికి పాల్పడిన నిందితులను సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ సిఐ లక్ష్మీ బాబు తెలిపిన వివరాల ప్రకారం వైన్స్ మార్చి 28వ తేదీన రాత్రి పది గంటలకు బందు చేసి వెళ్లి తిరిగి 29వ తేదీన వచ్చి చూడగా షట్టర్ కొంచెం తెరిచి ఉండడంతో అనుమానం వచ్చిన యజమాని పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల ద్వారా పరిశీలించిన పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు షేటర్ పైకి లోపలికి చొరబడ్డట్లు గుర్తించారు. వివిధ రకాల బ్రాండెడ్ కు సంబంధించిన 33 మద్యం బాటిల్లు.. 7 బీరు సీసాలు కౌంటర్ లో కొంత నగదును దొంగలించినట్లు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఈనెల మూడవ తేదీన పొన్నాల సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు. వారి నుండి రెండు మద్యం బాటిల్స్ మూడు సెల్ఫోన్లను వారు ప్రయాణించే కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్ తరలించారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత సీసీ కెమెరాలు ఆధారంగా ఆధునిక సాంకేతికతతో నిందితులను గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై మల్లేశం, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్, బాబులను సిఐ అభినందించారు. సీసీ కెమెరాల ఆధారంగానే నిందితుల కదలికలను గుర్తించి పట్టుకోవడం సులభతరం అయిందని వ్యాపార సంస్థలు ఉన్నచోట సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సిఐ సూచించారు.

విద్యుత్ సరఫరా లోపం రైతు పంటలకు శాపం

- వరి పంటల పరిశీలించిన నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జ్ వంటేరు

ప్రతిపక్షం, గజ్వేల్(కొండపాక), ఏప్రిల్ 3: నియోజకవర్గం లోని కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ సరఫరా లోపం కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రైతు పుట్ట మల్లేశం మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో రెండు ఎకరాల్లో సరైన సమయంలో కరెంటు అందక పంట పూర్తిగా ఎండిపోయిందని తెలిపాడు. ప్రతాప్ రెడ్డి ఎదుట రైతు కన్నీటి పర్యంతమై తన బాధను వెల్లగక్కాడు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవని, 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఉండేదని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సరైన సమయంలో కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయని, ఇచ్చే కరెంటు కూడా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. రైతులకు 12 గంటల విద్యుత్ కూడా సమర్థంగా అందడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం సాగునీటి ప్రాజెక్టులతో సస్యశ్యామలంగా మారిందని, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు రైతులకు మేలు చేశాయని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని విమర్శించారు. మల్లన్న సాగర్ నుండి తిమ్మాయిపల్లి వరకు కాలువలు, టన్నెల్ పనులను పూర్తి చేస్తే కొండపాకతో పాటు పరిసర ప్రాంతాలు పచ్చని పంటలతో కళకళలాడతాయని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పట్ల వివక్ష చూపకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగగా పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

"త్వరలోనే యూనిఫామ్ సివిల్ కోడ్ ను అమలు చేస్తాం. ఇకపై చొరబాటుదారులు నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోలేరు. గిరిజన ప్రాంతాలు యూసీసీ పరిధిలోకి రావు. మేఘాలయలో చొరబాటుదారులు గిరిజన మహిళలను వివాహం చేసుకొని గారో హిల్స్ అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌లో బలపడటానికి ప్రయత్నించారు. దీనివల్ల ఉద్రిక్తతలు తలెత్తాయి.

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అసోం ఓటర్లకు అమిత్ షా హామీలు

- కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు

వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్: అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాటుదారులను అరికడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అలాగే చొరబాటుదారులను అసోం నుంచి వెనక్కి పంపుతుందని వెల్లడించారు. గిరిజన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక పెద్ద డెయిరీని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను ఇస్తుందని స్పష్టం చేశారు. అసోంను కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు అడ్డాగా మార్చిందని ఆరోపించారు. ఈ మేరకు అసోంలోని గోల్పారాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ అసోంను చొరబాటుదారులకు కేంద్రంగా మార్చింది. వారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతాల్లోకి కూడా చొరబాటుదారులు వస్తారు. వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చొరబాటుదారులను ఎంపిక చేసి వెనక్కి పంపుతుంది. చొరబాటుదారులందరినీ గుర్తించాం. ప్రస్తుతం సమయం కొంచెం తక్కువగా ఉంది. మాకు ఐదేళ్ల సమయం ఇవ్వండి. మేము గుర్తించిన చొరబాటుదారులను దేశం నుంచి వెళ్లగొడతాం. కాంగ్రెస్ పాలనలో గిరిజన సమాజ అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ రూ. 25,000 కోట్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దాన్ని రూ. 1.38లక్షల కోట్లకు పెంచింది" అని అమిత్ షా పేర్కొన్నారు. కాంగ్రెస్ పదేపదే ఎన్నికల్లో పోటీ చేయడానికి అసోంకు వస్తుందని, కానీ ఇక్కడి గిరిజనుల సంక్షేమం గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదని అమిత్ షా ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయని, కానీ వారు (కాంగ్రెస్) ఒక్క గిరిజన మహిళనూ రాష్ట్రపతిని చేయలేదని అన్నారు.

విశ్వ వీక్షణం

మయన్మార్ దేశాధ్యక్షుడిగా మిన్ ఆంగ్ ఎన్నిక

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

మయన్మార్ కొత్త దేశాధ్యక్షుడిగా మిన్ ఆంగ్ హయింగ్‌ను ఇవాళ ఆ దేశ పార్లమెంట్ ఎన్నుకున్నది. మిలిటరీ జనరల్ అయిన మిన్ ఆంగ్.. ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. 2021లో ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వం కూల్చివేతలో మిన్ ఆంగ్ కీలక పాత్ర పోషించారు. సైనిక తిరుగుబాటుకు ఆయన పాల్పడ్డారు. అయితే గత అయిదేళ్ల నుంచి ఆయన మయన్మార్‌లో తన అధికారం పట్టును కోల్పోలేదు. దేశాధ్యక్షుడి పోస్టుకు పోటీపడిన ముగ్గురు నామినీల్లో మిన్ ఆంగ్ హయింగ్ ఒకరు. మిలిటరీ జుంటా మద్దతుతో పాటు ఆయన రాజకీయ మద్దతును కూడా కూడబెట్టుకున్నారు. దీంతో దేశాధ్యక్ష పదవి సులువుగా సొంతం చేసుకున్నారు. సైనిక తిరుగుబాటు తర్వాత తొలిసారి పార్లమెంట్ సమావేశం అయ్యింది. అయితే దీంట్లో ఎక్కువ శాతం ప్రతినిధులు మిన్ ఆంగ్‌కు మద్దతుగా నిలిచారు. పార్లమెంట్‌లో సైనిక దళాలకు పావువంతు సీట్లను కేటాయించారు. ఇంకా మిలిటరీకి చెందిన యూఎస్డీపీ పార్టీ ఎన్నికల్లో సుమారు 80 శాతం సీట్లను కైవసం చేసుకున్నది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాంట్లో ఎక్కువ శాతం మిలిటరీ వ్యక్తులే ఉన్నత పదవుల్లో కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

ఆటలతోనే ఆరోగ్యం!

ఆటలు పిల్లల దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి. ఆటలు ఆరోగ్యానికే కాదు పిల్లలకు వినోదం అందించడంలోనూ, బుద్ధి వికాసం కలిగించడంలోనూ, చురుకుదనం పెంచడంలో కూడా తోడ్పడతాయి. బడిలో ఆటల వల్ల పిల్లల్లో చక్కటి క్రమశిక్షణ, పట్టుదల, కార్యదీక్ష, సమయస్ఫూర్తి, ఐకమత్యం వంటి గుణాలు పెంపొందుతాయి. ప్రస్తుతకాలంలో పిల్లలు ఎలక్ట్రానిక్ ఆట వస్తువులతో ఎక్కువ సమయం గడపడం వల్ల, శారీరక వ్యాయామాలు చేయడం లేదు. దానితో వారు మందకొడిగా తయారవుతున్నారు. ఫలితంగా భవిష్యత్తులో అనారోగ్యాలు కలిగే అవకాశం ఉంది.

నేటితరం పిల్లలు ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునేవరకు శరీరానికి ఎటువంటి వ్యాయామాన్ని ఇవ్వడం లేదు. ఉదయమే ఏదో ఒక వాహనంలో బడికి బయలుదేరడం, సాయంకాలం మళ్లీ వాహనంలోనే ఇంటికి రావడం.. వచ్చీరాగానే టీవీ, కంప్యూటర్, ఫోన్ ఆటలతో బిజీ బిజీగా గడపడం.. ఇదీ నేటి పిల్లల దైనందిన జీవితం. ఇక పిల్లల శరీరానికి వ్యాయామమెక్కడిది? ఆరుబయట ఆటలు ఆడుకునే ప్రస్తావన ఏది? బడిలో కూడా పిల్లలకు సరైన ఆటస్థలం ఉండటం లేదు. ఫలితంగా పిల్లలకు అనేక రకాల అనారోగ్య సమస్యలు.. ఆటలంటే శరీరానికి వ్యాయామాన్ని, మెదడుకి ఆలోచనా శక్తిని పెంచే ఆటలే కానీ కంప్యూటర్ దగ్గర కూర్చుని ఆడేవి కాదు. మంచి ఆహారంతో పాటుగా శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడానికి సహకరించే ఆటలు కూడా ఆరోగ్యానికి ముఖ్యమే.. పిల్లలకు కనీసం ఆడవిడుపు లేకపోవడంతో అటు మానసికంగా, ఇటు శారీరకంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి నుండి గట్టెక్కాలంటే పిల్లలకు శారీరక శ్రమ కలిగేలా ఆడించాలని చెబుతున్నారు నిపుణులు. నిత్యం అలుపెరిగేలా ఆటలు ఆడితేనే ఆరోగ్యంగా పెరుగుతారని చెబుతున్నారు. వీడియోగేమ్స్, కంప్యూటర్ గేమ్స్ కాకుండా రోజుకు కనీసం ఓ నలభై నిముషాలైనా పిల్లలకు శారీరకశ్రమ ఉండే ఆటలు ఆడించాలి. ఆటలతో పాటు వ్యాయామానికి కాసేపు సమయం కేటాయించాలి. నేటి పాఠశాలలు చదువు నేర్పడానికే పరిమితమవుతున్నాయి. ఆటస్థలం కొంచెం కూడా లేని భవనాల్లో పాఠశాలలను నడుపుతున్నారు. పిల్లల మానసిక ఎదుగుదలకు, వికాసానికి విద్య ఎంత అవసరమో, వారి శారీరక దృఢత్వానికి, మానసిక ఆరోగ్యానికి ఆటల ద్వారా లభించే వ్యాయామమూ అంతే అవసరం. పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉండాలి. విద్యకు సంబంధించిన పరికరాలతో పాటు, క్రీడల కోసం సామాగ్రిని ఉంచడం అవసరం. విద్యతో పాటు, క్రీడలలో కూడా పిల్లలకు తర్ఫీదును ఇవ్వాలి.

అందుకోసం ప్రతి పాఠశాలలోనూ ఆటస్థలం ఉండాలి. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు తోటి పిల్లలతో కలిసి ఆటలాడటం లేదు. ట్యూషన్‌కు వెళ్ళడం లేదా హోంవర్కులు చేయడం, తర్వాత టీవీ, కంప్యూటర్ ఆటలతో గడపడం సరిపోతుంది. దీనితో వారి శరీరానికి సరైన వ్యాయామం ఉండటం లేదు. ఫలితంగా అనేక రకాల అనారోగ్య సమస్యలు.

ఆటల వల్ల లాభాలు

- ఆటలు ఆడటం వల్ల పిల్లల శరీరానికి వ్యాయామం లభిస్తుంది. వారిలో చురుకుదనం, శారీరక, జ్ఞాపకశక్తి, దారుఢ్యం, ఏకాగ్రత కూడా పెంపొందుతాయి. నీరెండలో ఆడటం వల్ల శరీరానికి విటమిన్ డి కూడా లభిస్తుంది.
- నడక, జాగింగ్, సరదా ఆటల వల్ల పిల్లల్లో ఎముకలు దృఢంగా తయారవుతాయి. చిన్నప్పటి ఆటలు జీవితంలో అనుకూల ప్రభావాన్ని చూపుతాయి. ఆటల వల్ల వారి శరీరంలో చెడు కొవ్వు చేరకుండా ఉంటుంది.
- ఆటల వల్ల పిల్లల్లో ఆశావహదృక్పథం అలవడుతుంది. శారీరకంగా బలంగా ఉన్న పిల్లల్లో మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మెదడులో ప్రతిస్పందనల వేగం కూడా ఎక్కువగా ఉంటుంది.
- ఆటల వల్ల ఊపిరితిత్తులు, కాలేయం, గుండె పనితీరు మెరుగవుతుంది. శరీరమంతా రక్తప్రసరణ జరుగుతుంది. కండరాలు బలపడతాయి. ఆటలు జీర్ణశక్తి పెంచుతాయి. మనసు ఆహ్లాదంగా ఉంటుంది. శరీరంలో కోపతాపాల్లాంటి ఉద్వేగాలు బయటకు వెళ్లిపోతాయి.
- ఆటల వల్ల పిల్లల్లో పరిచయాలు పెరుగుతాయి. ప్రవర్తనలో సర్దుబాటుతత్త్వం అలవడుతుంది. జయాపజయాలు అలవాటుపడతాయి.
- అప్పుడప్పుడూ పెద్దలు కూడా పిల్లలతో కలిసి ఆడటం వల్ల పిల్లలకు, పెద్దలు మరింత దగ్గరవుతారు. వారి మధ్య అనుబంధం చాలా ఆరోగ్యకరంగా ఉంటుంది.
- ఆటల్లో మంచి ప్రతిభ కనబరిచినవారిని ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తిని ఆటల ద్వారా చైతన్యవంతం చేస్తే వారు క్రమశిక్షణగల ఉత్తమ పౌరులుగా ఎదుగుతారనడంలో ఏమాత్రం సందేహం లేదు.

అబుదాబిలో క్షిపణి శకలాలు పడి.. ఐదుగురు భారతీయులకు గాయాలు

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

యూఏఈ రాజధాని అబుదాబిలో మరో ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. క్షిపణి శకలాలు పడటంతో 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురు భారత పౌరులు కాగా, మిగతా వారు నేపాల్ జాతీయులు. శుక్రవారం అబుదాబిలోని గ్యాస్ ప్లాంట్ పై ఇరాన్ దాడి చేసింది. ఆ క్షిపణులను ఎయిర్‌డిఫెన్స్‌తో అడ్డుకున్నట్లు యూఏఈ అధికారులు తెలిపారు. అజ్బాన్ ప్రాంతంలో క్షిపణి శకలాలు పడినట్లు పేర్కొన్నారు. కాగా, క్షిపణి శకలాలు పడటంతో 12 మంది వ్యక్తులు గాయపడినట్లు అబుదాబి మీడియా కార్యాలయం తెలిపింది. ఐదుగురు భారతీయులు, ఆరుగురు నేపాల్ జాతీయులు స్వల్పంగా గాయపడినట్లు పేర్కొంది. మరో నేపాల్ జాతీయుడు తీవ్రంగా గాయపడినట్లు వెల్లడించింది. ఆ ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టారని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు అబుదాబి మీడియా వెల్లడించింది. మరోవైపు మార్చి 26న అబుదాబిలోని స్వీహాన్ ప్రాంతంలో క్షిపణి శకలాలు పడ్డాయి. ఈ సంఘటనలో ఇద్దరు మరణించగా పలువురు గాయపడ్డారు. మరణించిన ఇద్దరిలో ఒక భారతీయ పౌరుడు ఉన్నాడు.

రాఘవ్ చద్దాపై ఆప్ మాటల దాడి..

- బీజేపీతో చేతులు కలిపారన్న పంజాబ్ సీఎం భగవంత్ మన్

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

రాజ్యసభ ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత రాఘవ్ చద్దాపై ఆ పార్టీ విమర్శల బాణం ఎక్కుపెట్టింది. చద్దాకు వ్యతిరేకంగా ఆప్ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. ఆయన బీజేపీతో చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు. రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న రాఘవ్ చద్దాను ఆ బాధ్యతల నుంచి ఆప్ తొలగించింది. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దాకు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య మాటలయుద్ధం ప్రారంభమైంది. ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. తనను పదవి నుంచి తొలగించగలరేమో కానీ, ఓడించలేరని రాఘవ్ చద్దా అన్నారు. అయితే, ఆయనపై ఆప్ ఎదురుదాడికి దిగింది. పంజాబ్ సీఎం భగవంత్ మన్ కూడా చద్దాపై విమర్శలు గుప్పించారు. బీజేపీతో రాఘవ్ చద్దా చేతులు కలిపారని, ఇది ఆమ్ ఆద్మీ పార్టీలో ఆందోళన కలిగించిందని భగవంత్ మన్ అన్నారు. రాజ్యసభలో లేవనెత్తాల్సిన అంశాలపై ఆప్ సూచించే విషయాల్ని చద్దా పాటించలేదన్నారు. రాజ్యసభలో ప్రజల సమస్యలపై ప్రశ్నించమంటే, చద్దా మాత్రం సమోసాలపై ప్రశ్నించారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తప్పకుండా ఏ పార్టీ అయినా చర్య తీసుకుంటుందన్నారు. మరో సీనియర్ ఆప్ లీడర్ సౌరభ్ భరద్వాజ్ కూడా రాఘవ్ చద్దాపై మండిపడ్డారు. చద్దాకు వీలైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించాలని కోరారు. పంజాబ్, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై చద్దా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాఘవ్ కొన్నేళ్లుగా భయపడుతున్నారని, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. సభలో మాట్లాడేందుకు దొరికే కొద్దిపాటి సమయంలో దేశం గురించి మాట్లాడాలని సూచించారు. చద్దా తీరుతో ఆప్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

దంతాలు తెల్లగా మెరవాలంటే..

చూడగానే మనిషిలో ఆకర్షించేది నవ్వు. నవ్వు అందంగా ఉండాలంటే పళ్ళు తెల్లగా ఉండాలి. నేటి కాలంలో అందంగా కనిపించాలంటే నోటి ఆరోగ్యం బాగుండాలి. అందులో దంతాలు కీ రోల్ పోషిస్తాయి. లేకపోతే దంతక్షయం, దంతాలపై మరకలు, నోటి దుర్వాసన వంటి సమస్యలొస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ పాలో అవ్వాలి. వీటిని ఫాలో అయితే దంతాలు ముత్యాల్లా మెరుస్తాయి. అవేంటో చూద్దాం..

- టీ, కాఫీలు రెగ్యులర్‌గా తాగేవారు నోరు కడగడం మర్చిపోవద్దు. నోరు క్లీన్ చేయకపోతే కాఫీ, టీ పళ్ళకి అతుక్కుని దంతాల రంగు మారుతుంది. దీంతో పాటు ధూమపానానికి కూడా దూరంగా ఉండాలి.
- వేప లేదా బాబుల్ పుల్లలు వాడి పళ్ళు తోముకోవడం వల్ల తోముకునేటప్పుడు ఆ పుల్లను నములుతున్నపుడు వాటిలోని యాంటీ బాక్టీరియల్ ఏజెంట్స్ విడుదల అవుతాయి. అవి మన దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడతాయి.
- ఎక్కువ నీటి శాతం ఉన్న పండ్లు కూరగాయలను తీసుకోవాలి. లేకపోతే దంతాల రంగు మారుతుంది.
- ఆయిల్ పుల్లింగ్‌తో కూడా దంతాలు తెల్లగా అవుతాయి. ఇది చేయాలంటే ఒకటి, రెండు టీ స్పూన్ల కొబ్బరినూనె తీసుకుని నోట్లో వేసుకోవాలి. దానిని 10 నుంచి 30 నిమిషాల పాటు అటూ ఇటూ అంటుండాలి. ఇలా చేస్తే నోట్లోని సూక్ష్మక్రిములు, విషాలు అన్నీ నూనెలో కలిసిపోయాయి. ఇవన్నీ కడుపులోకి వెళ్లకూడదు. ఇది ఉమ్మేసి పళ్ళు క్లీన్ చేయాలి. నెలకోసారి చేస్తే దంతాలపై మరకలు పోయి తెల్లగా మెరుస్తాయి.
- ప్రతి సారి భోజనం తిన్న తర్వాత, ముఖ్యంగా చాక్లెట్లు వంటి అంటుకునే ఆహార పదార్థాలను తిన్న తర్వాత బ్రష్ చేయడం చాలా ముఖ్యం. కానీ రోజుకు నాలుగుఐదు సార్లు పళ్ళు తోముకోవడం కుదరదు కనుక ప్రతి రోజు రెండుసార్లు బ్రష్ చేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే నిద్ర లేవగానే ఒకసారి, రాత్రి పడుకోబోయే ముందు ఒకసారి బ్రష్ చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.
- రోజుకి రెండు సార్లు పళ్ళు తోమాలి. ఉదయాన్నే దాదాపు అందరూ పళ్ళు తోముతారు. అయితే, రాత్రి పూట కూడా క్లీన్ చేయడం వల్ల దంతాలు పుచ్చిపోకుండా ఉంటాయి. రాత్రి పూట నోట్లో లాలాజలం తక్కువగా ఉంటుంది. నోరు శుభ్రంగా లేకపోతే దంత సమస్యలు వస్తాయి. అయితే, రెండు నిమిషాల కంటే ఎక్కువగా బ్రష్ చేయొద్దు.
- బ్రష్ చేయడం అందరూ చేస్తారు. అయితే, సరిగ్గా చేయాలి. లేకపోతే దంతాల ఎనామిల్ కోల్పోయి, దంతాల రంగు మారుతుంది. అందుకే హార్డ్‌గా ఉండే బ్రష్ వాడకుండా సాఫ్ట్ బ్రష్ వాడుకోవాలి.
- వేలితో చిగుళ్లను రోజూ సున్నితంగా మసాజ్ చేస్తే.. అవి ఆరోగ్యంగా ఉంటాయి.



ఓటీటీలోకి 'సరస్వతి'

వైవిధ్యమైన పాత్రలతో మెప్పించే వరలక్ష్మి శరత్‌కుమార్ ఇప్పుడు దర్శకురాలిగా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్.సరస్వతి' ఎట్టకేలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చేసింది. గత నెలలో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే సైలెంట్‌గా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది. సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే వారికి ఈ వీకెండ్‌లో ఇది ఒక మంచి ఆప్షన్ అని చెప్పాలి. వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన 'ఎస్.సరస్వతి' చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో జీవా, ప్రకాశ్ రాజ్, మురళీ శర్మ, రావు రమేశ్, ప్రియమణి వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో నటించారు. ఒక సాదాసీదా నర్సు తన కూతురు కోసం వ్యవస్థతో చేసే పోరాటమే ఈ సినిమా ఇతివృత్తం. నటిగా ఇప్పటికే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరలక్ష్మి, ఈ సినిమాతో మెగా ఫోన్ పట్టి తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించారు.

సంచలనం సృష్టిస్తున్న 'TN 2026'

కోలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఒక టీజర్ సంచలనాలు సృష్టిస్తోంది. దళపతి విజయ్ 'జననాయగన్' సినిమా విడుదల అనుకోని కారణాలు, రాజకీయ ఒత్తిడుల వల్ల ఆగిపోయినప్పటికీ, ఇప్పుడు రాబోతున్న 'TN 2026' చిత్రం మాత్రం ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు రావడానికి పక్కాగా సిద్ధమైంది. ఈ సినిమా దళపతి విజయ్ రాజకీయ ప్రయాణానికి ఎంతగానో మేలు చేస్తుందని, దానికి చాలా ఎక్కువ అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలతో పాటు అభిమానుల్లో చర్చ మొదలైంది. తమిళనాడు రాజకీయాలు, సినిమా స్టార్ల చుట్టూ తిరిగే పక్కా పొలిటికల్ సెటైరికల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. నట్టి నటరాజ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయన ఒక సినిమా సూపర్ స్టార్ నుంచి రాజకీయ నాయకుడిగా మారే పవర్‌ఫుల్ పాత్రలో దుమ్మురేపనున్నారు. ఈ కథను ప్రముఖ నటుడు తంబి రామయ్య అందించగా, ఆయన కుమారుడు ఉమాపతి రామయ్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి దర్బుక శివ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తుండగా, కణ్ణన్ రవి గ్రూప్స్ పతాకంపై కణ్ణన్ రవి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయగా.. ఒక ప్రముఖ సినిమా నటుడు తన అభిమాన సంఘాలను రాజకీయ పార్టీగా మార్చి ఎన్నికల బరిలోకి దిగితే ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి అనే కోణంలో ఈ సినిమా కథ ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఒక నటుడు రాష్ట్రాన్ని ఎలా పాలిస్తాడు? అంటూ ఇప్పటికే ఉన్న రాజకీయ నాయకులు అతడిని ప్రశ్నించడం, వారిని ఢీకొంటూ హీరో భారీ ప్రజాదరణ సంపాదించడం వంటి పవర్‌ఫుల్ సన్నివేశాలతో ఈ టీజర్ ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెంచేస్తోంది. ప్రస్తుత తమిళనాడు రాజకీయాల్లో జరుగుతున్న కొన్ని వాస్తవ సంఘటనలను ఈ సినిమాలో చాలా సెటైరిక్‌గా చూపించబోతున్నట్లు స్పష్టమైన హింట్లు ఇచ్చారు. ఎం.ఎస్. భాస్కర్, ఇళవరసు, రెడిన్ కింగ్స్లీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ 'TN 2026' చిత్రం ఈ ఏడాది ఏప్రిల్ 10న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కావడానికి ముస్తాబవుతోంది.

బోల్డ్.. బ్యూటీ

'కుమారి 21F' సినిమాతో కుర్రాళ్ల గుండెల్లో గంటలు కొట్టించిన హెబ్బా పటేల్, ఇప్పుడు సోషల్ మీడియాలో మరోసారి సెగలు పుట్టిస్తోంది. సినిమాల్లో గ్లామర్ పాత్రలతో మెప్పించిన ఈ భామ, తాజాగా పోస్ట్ చేసిన ఫోటోషూట్ నెట్టింట వైరల్ అవుతోంది. తన బోల్డ్ లుక్స్ మరియు ట్రెండీ ఫ్యాషన్ స్టైల్‌తో అభిమానులను ఫిదా చేస్తూ, సమ్మర్ హీట్‌ను మరింత పెంచేస్తోంది. హెబ్బా పటేల్ తాజాగా 'Borderline random' అంటూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఇందులో ఆమె వేసుకున్న షార్ట్ అండ్ స్టైలిష్ సమ్మర్ డ్రెస్ నెటిజన్ల దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తోంది. ముఖ్యంగా ఆమె బోల్డ్ అండ్ కాన్ఫిడెంట్ లుక్ చూసి ఫ్యాన్స్ ముగ్ధులవుతున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా హెబ్బా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన రెగ్యులర్ అప్డేట్స్, వెకేషన్ ఫోటోలు మరియు గ్లామరస్ ఫోటోషూట్‌లను ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటూ ఉంటుంది. అందుకే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్ కూడా భారీగానే ఉంది. తాజాగా చేసిన ఈ బోల్డ్ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది.

సొంత గడ్డపై చెన్నై చిత్తు!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో ఐదు సార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు వరుసగా రెండో షాక్ తగిలింది. సొంత గడ్డపై అభిమానుల హోరు మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పంజాబ్ వరుసగా రెండో గెలుపును నమోదు చేయగా.. సీఎస్కే తన ఖాతాను తెరవడంలో మరోసారి విఫలమైంది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుత ప్రదర్శన చేసింది. చెన్నై నిర్దేశించిన 210 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ బ్యాటర్లు మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఛేదించడం విశేషం. గత 8 మ్యాచ్‌ల్లో సీఎస్కేపై పంజాబ్‌కు ఇది 7వ విజయం కావడం గమనార్హం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ సంజు శాంసన్ (7) మరోసారి నిరాశపరిచాడు. అయితే యువ సంచలనం ఆయుష్ మాత్రే తన విధ్వంసకర బ్యాటింగ్‌తో స్టేడియాన్ని హోరెత్తించాడు. కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న ఆయుష్ మాత్రే.. మొత్తం 43 బంతుల్లో 73 పరుగులు (6 ఫోర్లు, 5 సిక్సర్లు) సాధించాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (28)తో కలిసి అతను రెండో వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మధ్యలో కార్తీక్ శర్మ (1) విఫలమైనప్పటికీ, సర్ఫరాజ్ ఖాన్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 12 బంతుల్లో 32 పరుగులు (6 ఫోర్లు, 1 సిక్సర్) చేసి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. చివర్లో శివమ్ దూబే 28 బంతుల్లో 45 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు స్కోరును 5 వికెట్ల నష్టానికి 209 పరుగులకు చేర్చాడు. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశాఖ్ 2 వికెట్లు తీశాడు.

సీఎస్‌కే బౌలర్ల వైఫల్యం

210 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు ఏమాత్రం తడబడలేదు. నిలకడగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ ఆరంభం నుండే విరుచుకుపడింది. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ మొదటి వికెట్‌కు కేవలం 4.2 ఓవర్లలోనే 61 పరుగులు జోడించారు. ప్రియాంశ్ ఆర్య కేవలం 11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసి అవుటయ్యాడు. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 43 పరుగులు చేసి రన్ అవుట్ కాగా, కూపర్ కానోలీ (36) తన వంతు సహకారం అందించాడు. అనంతరం కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇన్నింగ్స్ బాధ్యతను భుజానికెత్తుకున్నాడు. కేవలం 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అయ్యర్.. మొత్తం 29 బంతుల్లో 50 పరుగులు (4 ఫోర్లు, 3 సిక్సర్లు) చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. చివర్లో మార్కస్ స్టోయినిస్ (9*), శశాంక్ సింగ్ (14*) అజేయంగా నిలిచి 18.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఈ ఓటమితో సీఎస్కే పాయింట్ల పట్టికలో వెనుకబడగా, పంజాబ్ తన జైత్ర యాత్రను కొనసాగిస్తోంది.

ఆ ఇద్దరి వల్లే ఓడిపోయాం: రుతురాజ్ గైక్వాడ్

ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్కేకు వరుసగా రెండో షాక్ తగిలింది. సొంత గడ్డపై అభిమానుల హోరు మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పంజాబ్ వరుసగా రెండో గెలుపును నమోదు చేయగా.. సీఎస్కే తన ఖాతాను తెరవడంలో మరోసారి విఫలమైంది. ఈ ఓటమి అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తన మనోగతాన్ని పంచుకున్నాడు. ఈ మ్యాచ్ లో తాము నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యం గెలవడానికి సరిపోతుందని భావించినట్లు గైక్వాడ్ వెల్లడించాడు. పిచ్ పేసర్లకు అనుకూలించినప్పటికీ, స్లోయర్ బంతులు గ్రిప్ అవుతున్నాయని, భారీ బౌండరీలను పరిగణనలోకి తీసుకుంటే అది మంచి స్కోరు అని రుతురాజ్ గైక్వాడ్ అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్‌లో తమ ప్రదర్శన పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశాడు . ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో తాము అనుకున్న ప్రణాళికలు సరిగ్గా అమలు కాలేదని రుతురాజ్ అంగీకరించాడు. ముగ్గురు సీమర్లతో పాటు ఇద్దరు రిస్ట్ స్పిన్నర్లు కలిసి బౌలింగ్ చేయడం వల్ల జట్టుకు ప్రయోజనం ఉంటుందని ఇంపాక్ట్ ప్లేయర్ వ్యూహంతో బరిలోకి దిగామని.. కానీ ఆ ఇద్దరు స్పిన్నర్లకు అది కలిసిరాని రోజని రుతురాజ్ గైక్వాడ్ పేర్కొన్నాడు. మధ్య ఓవర్లలో కీలక సమయంలో ఒత్తిడి పెంచలేకపోవడం, వికెట్లు తీయలేకపోవడం తమను దెబ్బతీసిందని, దీనివల్లే పంజాబ్ బ్యాటర్లకు బ్యాటింగ్‌పై పట్టు లభించిందని వివరించాడు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200